తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం


ప్రతి అక్షరం ప్రజల కోసం

Published From: Medchal-Malkajgiri | సంపుటి: 5 సంచిక: 87 పేజీలు : 08 | గురువారం 19-3- 2026 వెల: 3 రూ/.




## రాజకీయాల్లో విరమణ అంటూ ఉండదు

### – రాజ్యసభలో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ** రాజకీయాల్లో విరమణ అంటూ ఏమి ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ, పదవీవిరమణ చేసిన సభ్యులు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. సభ నుంచి వెళ్లేవారు కొత్తగా వచ్చేవారికి స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. సభలో చర్చలు జరిగేటప్పుడు ఎన్నో రకాలు వాదనలు జరుగుతాయన్న మోదీ, ప్రజా ప్రయోజనాల పరిరక్షణే వాటి అంతిమ లక్ష్యమన్నారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లిఖార్జున

2లో..

## డాలర్ జోరు.. రూపాయి బేజారు

### – ఆల్‌టైమ్ కనిష్ఠానికి పతనం

**న్యూఢిల్లీ** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ మరోసారి చరిత్రాత్మక కనిష్ఠానికి పడిపోయింది. ట్రేడింగ్‌లో రూపాయి విలువ

2లో..







# మూసి ప్రక్షాళన

### – మాటలకే ఇంత కాలం మరి చేతలెప్పుడు.?

హైదరాబాద్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసి పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో, ప్రజల్లో హాట్ టాపిక్ గా మారింది. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగా ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసి నదిని లండన్ లోని థేమ్స్ నదిలా మారుస్తామని, నదీ తీరాన్ని ఆర్థిక హబ్‌గా మారుస్తామని భారీ స్థాయిలో ప్రచారం కల్పిస్తున్నారు. ఇటీవలే రూ.7,000 కోట్లతో మొదటి విడత పనుల మాస్టర్ ప్లాన్‌ను కూడా ఆవిష్కరించారు. అయితే, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా, పనులు ఇంకా ప్లానింగ్ , సర్వే దశలోనే ఉన్నాయి. 55 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు కేవలం భూసమీకరణ నోటిఫికేషన్లు , కొన్ని ప్రాథమిక నిర్మాణాలకే పరిమితం కావడం ప్రజల్లో సందేహాలను రేకెత్తిస్తోంది. ఈ ప్రాజెక్టుకు అతిపెద్ద అడ్డంకి నిర్వాసితుల సమస్య. నది పరివాహక ప్రాంతంలోని దాదాపు 10,000 పేద కుటుంబాలను తరలించడం అనేది ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది. మూసి జన ఆందోళన వంటి వేదికల ద్వారా బాధితులు తమ నిరసనలు తెలుపుతుండగా, ప్రతిపక్షాలు దీనిని లూటిఫికేషన్ అని విమర్శిస్తున్నాయి. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇస్తున్నప్పటికీ, తమ జీవనోపాధి దెబ్బతింటుందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. రాజకీయంగా ఈ వ్యతిరేకతను అధిగమించడం రేవంత్ సర్కార్‌కు పెద్ద సవాలు. ప్రభుత్వ పదవీకాలంలో మిగిలి ఉన్న రెండున్నరేళ్ల సమయం ఈ భారీ ప్రాజెక్టుకు చాలా తక్కువ. 2027-28 నాటికి మొదటి విడత పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, నిధుల సమీకరణ, వాస్తవ నిర్మాణం వంటి క్లిష్టమైన దశలు దాటాల్సి ఉంది. ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి సంస్థల నుంచి నిధులు ఆశిస్తున్నప్పటికీ, అవి సకాలంలో అందడం, పనుల్లో వేగం పెంచడంపైనే ప్రాజెక్టు భవితవ్యం ఆధారపడి ఉంటుంది. ప్రజలు కేవలం విజన్ను చూసి ఓట్లు వేయరు, ఫలితాలను బట్టి నిర్ణయించుకుంటారు.

2లో..

## ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

### - ఖర్గే, వేణుగోపాల్‌తో కీలక భేటీ



**న్యూఢిల్లీ** సీఎం రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా పార్టీ అధిష్ఠానంతో కీలక సమావేశాలు జరుపుతున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఆయన విడివిడిగా భేటీ అయ్యారు. ఖర్గేతో దాదాపు గంటపాటు జరిగిన సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన

2లో..

## పశ్చిమాసియా నుంచి సురక్షితంగా 2.6 లక్షల భారతీయులు

### - వెల్లడించిన విదేశాంగ శాఖ



**న్యూఢిల్లీ** ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియా నుంచి ఇప్పటి వరకు 2.6 లక్షల మంది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. పశ్చిమాసియాలో 19 రోజులుగా తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గల్ఫ్ దేశాల్లోని భారతీయులను కేంద్ర ప్రభుత్వం వెనక్కి రప్పించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో రెండు లక్షలకు పైగా భారతీయులను సురక్షితంగా తీసుకువచ్చింది. యూఏఈ నుంచి భారత్‌లోని వివిధ విమానాశ్రయాలకు

2లో..

## రాజ్యాలు పోయినా ఇంకా రాచరిక పోకడే

### – అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

- నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శ
- ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులు అన్న ముఖ్యమంత్రి
- కేసీఆర్ సభకు వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలని విజ్ఞప్తి

**హైదరాబాద్** రాజ్యాలు పోయినా రాచరిక పోకడలు పోలేదని, కొంతమంది ఇంకా తమను తాము రాజులుగా భావించుకుంటున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు అదే పోకడ, ప్రతిపక్షంలో ఉన్నా అదే తీరు అని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులు, రాజులు అని గుర్తుంచుకోవాలని సూచించారు. రేవంత్ రెడ్డి శాసనసభలో మాట్లాడుతూ, గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలను వివరించామని అన్నారు. గవర్నర్‌తో చర్చించిన తర్వాతనే ప్రసంగం తయారు చేసినట్లు

2లో..



## మూసీలో లక్షన్నర కోట్ల దోపిడీ

- ప్రాజెక్టులో పారదర్శకత లేదంటూ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ వాకౌట్
- కేటీఆర్ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం.. తొలిదశకు రూ.7,000 కోట్ల అంచనా అని వెల్లడి
- డీపీఆర్ లేకుండా వేల ఇళ్లను ఎలా కూల్చివేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్



**హైదరాబాద్** తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టుపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీ ప్రక్షాళన విషయంలో ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. జనవరిలో జరిగిన సమావేశాల్లో మూసీ డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు మార్చి బడ్జెట్

2లో..

## ముడి చమురుతో భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కీ'

### - గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకున్న నౌక




**న్యూఢిల్లీ** భారత జెండా కలిగిన 'జగ్ లాడ్కి' అనే ముడి చమురు నౌక బుధవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి వచ్చిన ఈ నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఈ నౌకను పుజైరా పోర్టులో లోడ్ చేశారు. 'జగ్ లాడ్కి' మొత్తం పొడవు 274.19 మీటర్లు, వెడల్పు 50.04 మీటర్లుగా ఉంది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయితే మనవద్ద ఇంధన నిల్వలు ఉన్నాయని, ఆందోళన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. మార్చి 14న పుజైరాలోని ఆయిల్ టెర్మినల్‌పై ఇరాన్ దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. 'జగ్ లాడ్కి' అదే సమయంలో అక్కడ ఇంధనం నింపుకుంటోంది. ఇంధనం నింపుకున్న అనంతరం ఈ నౌక అక్కడి నుంచి బయలుదేరి సురక్షితంగా భారత్ చేరుకుంది. ముర్బన్ క్రూడ్‌తో నిండిన


2లో..


## హైదరాబాద్ కేంద్రంగా.. మూడు బుల్లెట్ ట్రైన్ మార్గాలు

### – లోక్‌సభలో రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ** ఇండియన్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టుపై కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. దేశంలోని ప్రధాన నగరాలన్నింటినీ కలిపేలా హైస్పీడ్ రైలు బుల్లెట్‌లా దూసుకొస్తుందని చెప్పారు. ప్రధాన నగరాల మధ్య దూరం హైస్పీడ్ రైల్ కారిడార్‌తో తగ్గిపోతుందని, కొన్ని గంటల్లోనే ప్రధాన నగరాలను చేరుకుంటామని లోక్‌సభలో చెప్పారు. బుల్లెట్ రైలు రాకతో ముంబై పూణే మహానగాలు కలిసి పోయినట్లేనని కేవలం 48 నిమిషాల్లో ముంబై

2లో..





## తెలంగాణ కాంగ్రెస్‌లో దుమారం.?

### జగ్గారెడ్డి పీసీసీ చీఫ్ కావాలన్న కోమటిరెడ్డి

**హైదరాబాద్** తెలంగాణ కాంగ్రెస్‌లో పీసీసీ అధ్యక్ష పదవికి సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో దుమారాన్ని రేపాయి. ముఖ్యంగా ప్రస్తుత పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సామర్థ్యాన్ని తక్కువ చేసి చూపినట్లుగా ఈ వ్యాఖ్యలు ఉన్నాయనే విమర్శలు రావడంతో, కోమటిరెడ్డి దీనిపై వివరణ ఇచ్చారు.

#### నా మాటలను వక్రీకరించారు

సంగారెడ్డిలో జరిగిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో జగ్గారెడ్డి ఆర్గనైజింగ్ సామర్థ్యాన్ని మెచ్చుకుంటూ కోమటిరెడ్డి

2లో..

తెలుగు దినపత్రిక https://aksharagalam.com అక్షరగళం ప్రతి అక్షరం ప్రజల కోసం



# రాజకీయాల్లో విరమణ అంటూ ఉండదు

ఖర్గే, శరద్ పవార్ వంటి సీనియర్ నాయకుల నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. వీరంతా తమ జీవితంలో సగానికి పైగా పార్లమెంటరీ సేవలోనే గడిపారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్కు వీడ్కోలు తెలిపారు. సౌమ్యుడు, మృదుభాషి అయినా కఠిన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిగా ఆయనను ప్రశంసించారు. విరామ సమయాల్లో కూడా హరివంశ్ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ, జాతీయ ప్రాముఖ్యం గల అంశాలపై యువతతో మమేకమయ్యారని గుర్తు చేశారు.పదవీ విరమణ చేస్తున్న కొందరు సభ్యులు పాత, కొత్త పార్లమెంట్ భవనాలు రెండింటిలోనూ పనిచేసిన అరుదైన ఘనతను సాధించారని మోదీ అన్నారు. జీవితాన్ని తీర్చిదిద్దుకోవడానికి ఆరేళ్ల రాజ్యసభ పదవీకాలం అమూల్యమైన అవకాశమని చెప్పారు.

# ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

వ్యూహాలు, ప్రతిపక్షాల తీరు వంటి అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పదవుల నియామకాలపై సీఎం అధిష్ఠానంతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. పార్టీ అభ్యర్థులుగా బరిలోకి దిగిన వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఎలాంటి విమర్శలకు తావివ్వకుండా రెండు స్థానాలను గెలుచుకోవడం పట్ల ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లను వారు అభినందించారు. అనంతరం నూతన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని వెంటబెట్టుకుని రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు.

# అగ్నిపరీక్షగా మూసి ప్రక్షాళన

ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని చెప్పడం రాజకీయంగా ప్రయోజనం చేకూర్చవచ్చు కానీ, సామాన్య ప్రజలు మాత్రం క్షేత్రస్థాయిలో మార్పును కోరుకుంటారు. ఒకవేళ వచ్చే రెండున్నరేళ్లలో కనీసం 50 శాతం పనులు కూడా పూర్తి కాకపోతే, ఇది కేవలం మాటల సీఎం అనే విమర్శకు ఆస్కారం ఇస్తుంది. గత ప్రభుత్వాల హయాంలో కూడా ఇలాంటి ప్రకటనలు వచ్చి ఆగిపోయిన చరిత్ర ఉండటంతో, రేవంత్ రెడ్డిపై ఒత్తిడి మరింత ఎక్కువగా ఉంది.కేవలం గ్రాఫిక్ డిజైన్లు, ప్రసంగాలకే పరిమితం కాకుండా, ప్రభుత్వం తక్షణమే పనులను పట్టాలెక్కించాలి. నదిలో మురికినీరు కలవకుండా చేసే ఎస్టీపీల నిర్మాణం, నదీ గర్భం ప్రక్షాళన వంటి ప్రాథమిక పనులు కంటికి కనిపిస్తేనే ప్రజల్లో నమ్మకం కలుగుతుంది. నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో పారదర్శకత పాటిస్తూ, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానంగా పనుల పురోగతిని చూపడమే రేవంత్ రెడ్డి ముందున్న ఏకైక మార్గమన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# పశ్చిమాసియా నుంచి సురక్షితంగా 2.6 లక్షల భారతీయులు

70 సర్వీసులు నడుస్తున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి మన పౌరులు, విద్యార్థులకు సహాయం అందిస్తోందని వెల్లడించింది. చాలామంది భారతీయులు ఇరాన్ సరిహద్దు దాటి అర్మేనియా, అజర్‌బైజాన్‌లకు వెళ్లాలని భావిస్తున్నారని తెలిపింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో, ప్రధాని నరేంద్ర మోదీ కువైట్ యువరాజుతో ఫోన్‌లో సంభాషించారు. కువైట్‌పై దాడులను భారత్ ఖండిస్తున్నట్లు తెలిపారు. హార్మూజ్ జలసంధి ద్వారా నౌకలు సురక్షితంగా, స్వేచ్ఛగా వెళ్లేలా చూడాలని అన్నారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి నిరంతరం దౌత్య చర్చలు అవసరమని పేర్కొన్నారు.

# ముడి చమురుతో భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కీ'

ఈ నౌక మూడు రోజుల ప్రయాణం అనంతరం గుజరాత్ తీరానికి చేరుకుంది. ఇప్పటికే శివాలిక్, నందాదేవి నౌకలు హర్మూజ్ జలసంధిని గుండా ప్రయాణించి సురక్షితంగా భారత్ చేరుకున్నాయి. ఈ నౌకలు ఎల్పీజీ గ్యాస్‌ను తీసుకువచ్చాయి. సముద్రమార్గంలో జరిగే చమురు రవాణాలో ఐదవ వంతు హర్మూజ్ జలసంధి ద్వారా ఉంటుంది.

# తెలంగాణ కాంగ్రెస్‌లో దుమారం.?

వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదానికి కేంద్రబిందువు అయ్యాయి. జగ్గారెడ్డి పీసీసీ చీఫ్ అయితే కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు వస్తాయని ఆయన అనడం, ప్రస్తుతం పదవిలో ఉన్న మహేష్ కుమార్ గౌడ్‌ను కించపరచడమేనని పార్టీ వర్గాల్లో చర్చ నడిచింది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పీసీసీ మార్పుపై ఊహాగానాలు మొదలయ్యాయి.

### మహేష్ కుమార్ గౌడ్‌తో స్నేహం

ఈ వివాదంపై స్పందించిన కోమటిరెడ్డి, ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌తో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. మహేష్ కుమార్ గౌడ్ నాకు ఎన్ఎస్‌యూఐ రోజుల నుండి అత్యంత సన్నిహిత మిత్రుడు. ఆయన సారథ్యంలోనే గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించాం అని ఆయన ప్రశంసించారు. మహేష్ కుమార్‌పై తాను ఎలాంటి వ్యతిరేక వ్యాఖ్యలు చేయలేదని, కొందరు కావాలనే తన మాటలను వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

### జగ్గారెడ్డిపై వ్యాఖ్యల వెనుక ఉద్దేశం

సంగారెడ్డి కార్యక్రమంలో తాను చేసిన వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని కోమటిరెడ్డి వివరించారు. అక్కడ జగ్గారెడ్డి చేసిన జనసమీకరణ, కార్యక్రమ నిర్వహణ తీరు చూసి ముగ్ధుడనై, భవిష్యత్తులో ఆయనకు పీసీసీ అయ్యే అర్హత ఉందని మాత్రమే చెప్పానని స్పష్టం చేశారు. ఇప్పుడున్న పీసీసీ అధ్యక్షుడిని తొలగించాలనే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని, జగ్గారెడ్డి పనితీరును మెచ్చుకోవడమే తన ప్రధాన ఉద్దేశమని ఆయన క్లారిటీ ఇచ్చారు.

ఈ వివరణతో పీసీసీ వివాదానికి తెరదించే ప్రయత్నం చేసినప్పటికీ, కాంగ్రెస్ పార్టీలో సీనియర్ల మధ్య ఉన్న అంతర్గత పోటీ మరోసారి బహిర్గతమైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కోమటిరెడ్డి వివరణతో ప్రస్తుతానికి ఈ వివాదం సద్దుమణిగినట్లు కనిపిస్తోంది.

## హైదరాబాద్ కేంద్రంగా..

# మూడు బుల్లెట్ ట్రైన్ మార్గాలు

నుంచి పూణే చేరుకోవచ్చని చెప్పారు. కేంద్రమంత్రి ప్రసంగంలో హైదరాబాద్ పేరు ప్రముఖంగా వచ్చింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన మార్గాలు కలుపుతున్నాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పూణె నుంచి రెండు గంటల్లో హైదరాబాద్‌కు వెళ్లొచ్చని హైదరాబాద్ నుంచి రెండున్నర గంటల్లో బెంగళూరు అక్కడి నుంచి కేవలం 72 నిమిషాల్లో చెన్నైకి వెళ్లిపోవచ్చన్నారు. ఇక హైదాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నైకి మూడున్నర గంటల్లో వెళ్లిపోవచ్చన్నారు. దీంతో అమరావతి మీదుగా బుల్లెట్ రైల్ వెళ్లబోతోందన్న క్లారిటీ కూడా వచ్చేసింది.

# రాజ్యాలు పోయినా ఇంకా రాచరిక పోకడే

తెలిపారు. కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నాయకులు వస్తారని భావించామని, ప్రధాన ప్రతిపక్షంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందని భావించామని, గవర్నర్ ప్రసంగంపై సూచనలు, సలహాలు వస్తాయని భావించామని, కానీ ఏమాత్రం స్పందన రాలేదని అన్నారు.కేసీఆర్ సభకు వచ్చి, ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యేందుకు మాజీ ప్రధానమంత్రి పీవీ విధానాలే కారణమని అన్నారు. పీవీ, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హైటెక్ సిటీకు పునాది రాయి వేశారని తెలిపారు. ఆ తర్వాత చంద్రబాబు, వాజ్‌పేయి హైటెక్ సిటీని పూర్తి చేశారని రేవంత్ రెడ్డి అన్నారు. ఏఐ కారణంగా లక్షలాది ఉద్యోగాలు పోయి నిరుద్యోగ సమస్య తలెత్తే ప్రమాదం ఉన్నదని, ఈ పరిస్థితుల్లో భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. హైడ్రా ద్వారా హైదరాబాద్‌లోని చెరువులను పునరుద్ధరిస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. నాలాల ఆక్రమణలను పరిష్కరించి ముంపు సమస్యను పరిష్కరిస్తున్నామని అన్నారు. హైదరాబాద్‌లో నాలాలపై 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని గతంలో కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. వాటిని నిర్దాక్షిణ్యంగా కూల్చాలని ఆయన హయాంలో ఆదేశాలు ఇచ్చారని, నాటి బీఆర్ఎస్ కార్యాచరణనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు. సబర్మతి, గంగా, యమునా ప్రాజెక్టుల గురించి గొప్పగా చెబుతున్న బీజేపీ నాయకులు మూసీ ప్రాజెక్టును తప్పుబట్టడం విడ్డూరమని అన్నారు. మెట్రో రైలును విస్తరించేందుకు కష్టపడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నగరానికి మూడు బుల్లెట్ రైళ్లు రానున్నాయని అన్నారు.

# మూసీలో లక్షన్నర కోట్ల దోపిడీ

సమావేశాల నాటికే డీపీఆర్ సిద్ధమైందని ఎలా చెబుతోందని ఆయన ప్రశ్నించారు.

### డీపీఆర్ సంస్థపై కేటీఆర్ ఆరోపణలు

మూసిలో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.. అందుకే ఈ అంశం పై సభ నుంచి వాకౌట్ చేస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ తయారీ బాధ్యతలను అప్పగించిన 'మెయిన్ హార్ట్' సంస్థపై కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్తాన్ వంటి దేశాల్లో నిషేధానికి గురైన మరియు అనేక కేసుల్లో ఇరుక్కున్న బ్లాక్ లిస్ట్ సంస్థకు ఇంతటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ఎలా అప్పగిస్తారని ఆయన నిలదీశారు. అటు ఏడీబీ సంస్థ కూడా తాము మూసీపై ఎలాంటి డీపీఆర్ ఇవ్వలేదని లేఖ రాయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఒకవైపు ముఖ్యమంత్రి లక్షన్నర కోట్లు ఖర్చు అవుతుందని, మరోవైపు 4 వేల కోట్లు అని పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని మండిపడ్డారు.ప్రభుత్వ గెజిట్ ప్రకటనలకు, మంత్రుల మాటలకు అస్సలు సంబంధం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. అసలు డీపీఆర్ లేకుండానే 1,400 నిర్మాణాలను ఎలా గుర్తించారని ఆయన ప్రశ్నించారు. మూసీ అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఈ గందరగోళంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అవినీతికి ఆస్కారం ఇచ్చేలా బ్లాక్ లిస్ట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకోవడంపై క్లారిటీ ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ సభ్యులు సభలో నిరసన వ్యక్తం చేశారు. మూసీ డీపీఆర్ తయారీ బాధ్యతలను 'మెయిన్‌హార్ట్' అనే సంస్థకు అప్పగించడంపై కేటీఆర్ మండిపడ్డారు. ఈ సంస్థను గతంలో సింగపూర్, పాకిస్తాన్ మరియు భారతదేశంలోని జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో బ్లాక్ లిస్ట్ చేశారని, ఎన్నో వివాదాలున్న సంస్థకు ఇంతటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ఎలా అప్పగిస్తారని కేటీఆర్ నిలదీశారు. గతంలో ఇదే సభలో డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని చెప్పిన ప్రభుత్వం, కేవలం 2 నెలల్లోనే అది ఎలా సిద్ధమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అంత వేగంగా సిద్ధం చేస్తే, ఆ నివేదికను సభ ముందు పెట్టి ప్రజలకు వివరించాలని కోరారు. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సుమారు రూ. 4,100 కోట్ల రుణం ఇస్తోందని తెలంగాణ ప్రభుత్వం ప్రచారం చేస్తోందని, కానీ ఆ సంస్థ నుండి తమకు అందిన సమాచారం ప్రకారం ఎలాంటి డీపీఆర్ అందలేదని, రుణంపై స్పష్టత లేదని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సభను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. గతంలో రూ. 16 వేల కోట్లతో పూర్తవుతుందని చెప్పిన ఈ ప్రాజెక్టుకు, సీఎం రేవంత్ రెడ్డి ఏకంగా లక్షన్నర కోట్లు ఖర్చు అవుతుందని చెప్పడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే, సభలో 1400 ఇళ్లు కూలుస్తామని చెబుతూనే, గెజిట్‌లో 10 వేలకు పైగా నిర్మాణాలను తొలగిస్తామని పేర్కొనడంపై క్లారిటీ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బఫర్ జోన్ పరిమితిని పెంచుతూ స్థానిక అధికారుల ద్వారా నోటీసులు ఇప్పిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అసలు ఎన్ని వేల ఇళ్లను కూల్చబోతున్నారో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ పట్టుబట్టారు. కానీ సభలో సరైన తీరుగా చర్చ జరిగి ప్రభుత్వం వాస్తవాలు బయటపెట్టడం లేదని, అందుకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశామన్నారు.

# డాలర్ జోరు.. రూపాయి బేజారు

92.63 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటం, దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ నిధుల తరలింపు కొనసాగడం వంటి అంశాలు రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో ఉదయం 92.42 వద్ద ప్రారంభమైన రూపాయి, ఆ తర్వాత మరింత బలహీనపడింది. మంగళవారం రూపాయి 92.37 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. కీలకమైన 92.50 స్థాయిని దాటి కిందకు పడటంతో అమ్మకాల ఒత్తిడి పెరిగిందని, దీనికి తోడు బ్యాంకు సెలవుల కారణంగా డాలర్ల లభ్యత తక్కువగా ఉండటం కూడా రూపాయి పతనానికి కారణమైందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ వివరించారు. దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ భారీగా ఉందని ఆయన తెలిపారు. మరోవైపు పెరుగుతున్న దిగుమతుల బిల్లుల కారణంగా రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వీపీ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది అన్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల అధిక ముడి చమురు ధరలు, హర్మూజ్ జలసంధి ద్వారా రవాణాకు అంతరాయాలు కలగడం వంటి అంశాలు భారత్‌కు దిగుమతి వ్యయాన్ని పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థూల ఆర్థిక పరిస్థితులు రూపాయికి ప్రతికూలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో డాలర్‌తో రూపాయి విలువ 92.25 నుంచి 92.95 శ్రేణిలో కదలాడవచ్చని త్రివేది అంచనా వేశారు.ఎ

# అక్రమ వలసదారులకు బోనస్

**వాషింగ్టన్,** డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమెరికా గ్రేట్ అగైన్ పేరుతో చర్యలు తీసుకుంటూనే మరోవైపు దేశంలో ఉన్న అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపారు. తాజాగా అక్రమవలసదారులను వారి దేశానికి తిప్పి పంపేందుకు మంచి ఆఫర్ ఇచ్చారు. అమెరికా అక్రమంగా ఉన్న వారు తమ స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు లేదా తమకు చట్టబద్ధమైన హోదా ఉన్న ఇతర దేశాలకు తిరిగి వెళ్లడాన్ని సులభతరం చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సిబిపి హోమ్ మొబైల్ యాప్ ద్వారా ఉచిత ప్రయాణతో పాటు, 2,600 డాలర్ల ఎగ్జిట్ బోనస్‌ను పొందే చారిత్రాత్మక అవకాశాన్ని హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రకటించింది.అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వారిని వెనక్కి పంపేందుకు ట్రంప్ ప్రభుత్వం సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. "ప్రాజెక్ట్ హోమ్‌కమింగ్" పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా, అక్రమ వలసదారులు తమంతట తాముగా దేశం విడిచి వెళ్తే (సెల్ఫ్ డిపోర్టేషన్) వారికి భారీ నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనుంది. బలవంతపు అరెస్టులు, బహిష్కరణల కంటే ఈ పద్ధతి ద్వారా వలసదారులను గౌరవప్రదంగా అమెరికా నుంచి వారి స్వదేశాలకు తిప్పి పంపవచ్చని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది.ఈ పథకం కింద అక్రమ వలసదారులు తమ స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు అయ్యే విమాన ప్రయాణ ఖర్చులను అమెరికా ప్రభుత్వమే భరిస్తుంది. దీనికి అదనంగా, నిబంధనల ఉల్లంఘన వల్ల విధించే జరిమానాలను రద్దు చేయడమే కాకుండా, ప్రతి వ్యక్తికి 2,600 డాలర్ల (సుమారు రూ. 2.18 లక్షలు) ఎగ్జిట్ బోనస్‌ను కూడా అందజేస్తుంది. ముఖ్యంగా భారతీయులను ఆకట్టుకునేందుకు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం తాజ్ మహల్ చిత్రంతో కూడిన ప్రత్యేక పోస్టర్లను సోషల్ మీడియాలో విడుదల చేసింది. భారత్‌తో పాటు చైనా, కొలంబియా దేశాలకు చెందిన ఫొటోలతో ఈ పథకాన్ని ప్రచారం చేస్తోంది.ఈ ప్రయోజనాన్ని పొందాలనుకునే వారు 'అఃఖ ఊనీఎవ' మొబైల్ యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. ఒకసారి వెరిఫికేషన్ పూర్తయ్యాక, ప్రభుత్వం వారికి ఉచితంగా టిక్కెట్ బుక్ చేస్తుంది. వలసదారులు తమ దేశానికి చేరుకున్నట్లు యాప్ ద్వారా ధృవీకరించిన వెంటనే ప్రోత్సాహక నగదు వారి ఖాతాలో జమ అవుతుంది. అమెరికాలో ఉన్న సుమారు 1.1 కోట్ల మంది అక్రమ వలసదారులను తక్కువ ఖర్చుతో వెనక్కి పంపేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే దాదాపు 19 లక్షల మంది ఈ పథకాన్ని వినియోగించుకున్నట్లు వైట్ హౌస్ వర్గాలు వెల్లడించాయి.

# తండ్రి, కూతుళ్లను చంపిన అల్లుడు

**వరంగల్,** హనుమకొండ జిల్లా కడిపికొండ రాజీవ్ గృహకల్పలో దారుణం చోటు చేసుకుంది. తండ్రి, కుమార్తె అనుమానాస్పదస్థితిలో సజీవదహనమయ్యారు. కుటుంబ కలహాల నేపథ్యంలో అల్లుడు ప్రవీణ్ ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలిసింది. ఘటన అనంతరం నిందితుడు పిల్లలతో పారిపోయేందుకు ప్రయత్నించగా.. మడికొండ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.హనుమకొండ జిల్లా కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్పలో విషాదం చోటు చేసుకుంది. అనుమానాస్పద రీతిలో తండ్రి, కుమార్తె సజీవ దహనమయ్యారు. ఇవాళ ఉదయం నాలుగు గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. మృతులు రాజశేఖర్ , ఆయన కుమార్తె రాజశ్రీగా గుర్తించారు. కుటుంబ గొడవల కారణంగానే అల్లుడు ప్రవీణ్ వారిద్దరినీ పెట్రోల్ పోసి తగలబెట్టినట్లు తెలిసింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మడికొండ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. వేలిముద్రలు, ఇతర ఆధారాలను పోలీసులు సేకరించారు. ఘటన తర్వాత ప్రవీణ్ తన కూతురు, కుమారుడిని తీసుకొని పారిపోయేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. హత్యకు గల పూర్తి వివరాలు ప్రవీణ్ విచారణ తర్వాత వెలుగులోకి రానున్నాయి.

మంచిర్యాల పట్టణంలోనూ విషాదం చోటు చేసుకుంది. కాలేజ్ రోడ్డులో నివాసముండే ఎడ్ల శ్రీనివాస్, రజిత దంపతులు మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తమ కుమార్తె రిషితను కాలేజీలో దింపి తిరిగి వస్తుండగా.. పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ వద్ద వీరి వాహనం ప్రమాదానికి గురైంది. ఇంటికి చేరుకోవడానికి కొద్ది నిమిషాల ముందే దంపతులు మృతి చెందడం స్థానికులనుగ్భ్రాంతికి గురిచేసింది. స్థిరాస్తి వ్యాపారంలో రాణిస్తూ ఎంతోమందితో అనుబంధం ఉన్న శ్రీనివాస్ మరణవార్త తెలియగానే, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో వారి నివాసానికి చేరుకున్నారు. తల్లిదండ్రుల మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న కుమార్తె రిషిత వారికి అంత్యక్రియలు నిర్వహించిన తీరు చూసి అక్కడి వారందరూ చలించిపోయారు.శ్రీనివాస్ జీవితాంతం లయన్స్ క్లబ్ సభ్యుడిగా అనేక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆ సేవా గుణాన్ని ఆయన మరణానంతరం కూడా కొనసాగించేలా కుటుంబ సభ్యులు గొప్ప నిర్ణయం తీసుకున్నారు. క్లబ్ సభ్యుల కోరిక మేరకు మరణించిన శ్రీనివాస్ - రజిత దంపతుల నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. నలుగురికి చూపునిచ్చి, భౌతికంగా దూరమైనా సేవా భావంతో చిరస్మరణీయులుగా నిలిచారు.

## గ్యాస్ సిలిండర్ కోసం

# వినియోగదారులు ఇబ్బందులు



**హోళగుంద** :మండల కేంద్రానికి ప్రతి బుధవారం భారత్ గ్యాస్ సిలిండర్ ఏజెన్సీ,ఆదివారం ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వారు లబ్ధిదారులకు ఆదోని నుంచి హోళగుందకు వచ్చి వినియోగదారులు అందించేవారు.అయితే ఆదివారం ఇండియన్ గ్యాస్,మంగళవారం భారత్ గ్యాస్ సిలిండర్ కోసం దాదాపు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సిలిండర్ లను వరుసలో గ్యాస్ సిలిండర్ కోసం పడిగాపులు కాసిన ఏజెన్సీవారు మాత్రం హోళగుందకు రాకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.ముఖ్యంగా ఉగాది పండుగకు లబ్ధిదారులకు అవసరమైన సిలిండర్ అందకపోవడంతో సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని....ప్రజల ఇబ్బందులు కనబడవా...అన్ని మండిపడ్డారు.మరియు సిలిండర్ రాకపోవడంతో దాదాపు 200 మంది వినియోగదారులు ఖాళీ సిలిండర్లతో ఇళ్లకు వెనుదిరిగారు.కావున తహసీల్దార్ సమస్య పై దృష్టి సారించి సంబంధిత ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని చంద్రప్ప,చినిగి సాబ్,గాదిలింగ తదితరులు కోరా

# బద్వేల్ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా ఆర్డీవో చంద్రమోహన్ బాధ్యతలు స్వీకరణ



**బద్వేలు** బద్వేల్ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా బత్తుల ఆర్టీవో చంద్రమోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు మంగళవారం మున్సిపాలిటీ పాలవర్గం కాలం తీరిపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది అందులో భాగంగా బద్వేల్ మున్సిపాలిటీకి ఆర్డిఓ చంద్రమోహన్ బాధ్యతలు స్వీకరించారు ఆయనకు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు

# పదవ తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్** పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 'స్టాటిక్ ఫోర్స్'తో పటిష్ట భద్రతఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు.?విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా వాతావరణం.రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించబడుతున్న నేపథ్యంలో, కరీంనగర్ లో పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.?ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ. పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద ఒక నిరంతర నిఘా ఉంచేందుకు 'స్టాటిక్ ఫోర్స్'ను కేటాయించామని, పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు.?పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఇతర పోలీసు అధికారులు మరియు విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా

# సందీప్ సాయి నియామకం

- కాంగ్రెస్ వైఖరిని ఎండగడతాం - సందీప్ సాయి
- ఎంఐఎం ఎమ్మెల్యే ల పై దేశద్రోహం నమోదు చేయాలని డిమాండ్

**హైదరాబాద్** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సందీప్ సాయి నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్రావు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మాసబ్ ట్యాంక్ లోని ఆయన నివాస గృహంలో సందడి వాతావరణం నెలకొంది. తెలంగాణలోని పలు జిల్లాలకు చెందిన బీజేపీ నేతలతో పాటు నాంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు విచ్చేసి సందీప్ సాయి కి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మూసి సుందరీకరణ పేరుతో , మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే ప్రయత్నం జరుగుతోందని ధ్వజమెత్తారు. మూసి పునరుద్ధరణ పేరుతో పేదల ఇళ్ళను కూల్చవద్దని కోరారు. ఎంఐఎం పార్టీ ప్రయోజనాల కోసం జిహెచ్ఎంసి కార్పొరేషన్ ను మూడు ముక్కలు చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఏది చేసిన ఎంఐఎం అనుమతితోనే చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా ఎంఐఎం ఎమ్మెల్యేలు జాతీయ గీతాన్ని అవమానపరచడం శోచనీయం. వీరిపై స్పీకర్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీరిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని కోరారు. గతంలో టిఆర్ఎస్ పార్టీ కూడా కాంగ్రెస్ తరహాలోనే ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడంతోనే ప్రజలు ఆ పార్టీని దూరం పెట్టారని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాదులో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బిజెపి క్లీన్ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మూడు కార్పొరేషన్లలో మేయర్ పదవులను కైవసం చేసుకుంటామని స్పష్టం చేశారు. తనకు రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు, సహకరించిన ఇతర సీనియర్ నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.




తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
తెలంగాణ రౌండప్
గురువారం - 19 మార్చి 2026 - పేజీలు

### తాళాం వేసిన ఇంటిలో చోరీకి

# పాల్పడ్డ నిందితుడు అరెస్ట్



**కీసర, మార్చి 18,(అక్షర గళం)** : తాళాం వేసిన ఇంటిలో చోరీకి పాల్పడ్డ నిందితుడిని కీసర పోలీసులు పట్టుకున్నారు.నిందితుడి వద్ద నుండి దొంగిలించిన బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్‌ను ని ా ్వ దీ . న ం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సుభాష్ నగర్ కాలనీకి చెందిన ఆరుమళ్ల వెంకట్ రెడ్డి ఈ నెల 16న ఉదయం సుమారు 9 గంటలకు తన భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు.అనంతరం మధ్యాహ్నం 12:05 గంటలకు తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టబడినట్లు గుర్తించారు.ఈ ఘటనలో కీసర ప్రాంతానికి చెందిన బాల నేరస్థుడు దర్యాగుల జగదీష్ అలియాస్ సంతోష్ అలియాస్ సంతు ఇంట్లోకి చొరబడి, అల్మిరాలోని బంగారు ఉంగరాలు,చిన్న గొలుసు,చెవి దిద్దులు (మాటీలు) మరియు రియల్‌మీ మొబైల్ ఫోన్‌ను దొంగిలించినట్లు తేలింది.పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కీసర పోలీస్ ఇన్స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి,మార్చ్ 18న బుధవారం రోజు నిందితుడిని పట్టుకుని,దొంగిలించిన వస్తువులను రికవరీ చేశారు.అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.ఇళ్లను ఖాళీగా వదిలి వెళ్లేటప్పుడు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని కీసర పోలీసులు ప్రజలకు సూచించారు.

## మాజీ మంత్రి తుళ్ళ దేవేందర్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ

- పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నాగారం పలువురు ప్రముఖులు





**నాగారం,మార్చి 18,(అక్షర గళం)** :ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మాజీ మంత్రి తుళ్ళ దేవేందర్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలోనాగారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ ఎంపిటిసి మల్లేష్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, నక్క కిషోర్ గౌడ్, మెరుగు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

### కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే

# గ్యాస్ సంక్షోభం

- 500 కే గ్యాస్ అని చెప్పి ఆగం చేసిన ప్రభుత్వం
- యువనాయకులు పోలే అశోక్



**వెల్దండ మార్చి 18 (అక్షర గళం)** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యంతోనే గ్యాస్ సిలిండర్ల సమస్య తీవ్రతరమై కొరత ఏర్పడిందని బీఆర్ఎస్ పార్టీ మండల యువ నాయకుడు అశోక్ బుధవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో అన్నారు. పెంచిన గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని, చమురు సంక్షోభాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నెలకొన్న ఈ సంక్షోభానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దూరదృష్ట లేని విధానాలే కారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 500 గ్యాస్ కనెక్షన్ ఇస్తా అని చెప్పి ప్రజలను మోసం చేసింది వినియోగదారులను రక్షించాల్సింది పోయి ఆ భారాన్ని ప్రజలపై మోపడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. గృహ సిలిండర్లపై రూ.60 రూపాయలు, వాణిజ సిలిండర్లపై రూ. 115 రూపాయలు పెంచడంతోపాటు అనేక ప్రాంతాలలో లభ్యతలో లేకపోవడంతో వంట గ్యాస్ పొందడానికి ప్రజలు మండే ఎండలో, క్యూలైన్లో గంటల తరబడి నిలబడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువైన ఎల్పీజీని రోజువారి పోరాటంగా మలిచారని మండిపడ్డారు. వాణిజ్య సిలిండర్లపై ఆధారపడిన చిరు వ్యాపారులైన టీ స్టాల్, హోటల్, రెస్టారెంట్లు పనిచేసేవారు ఇప్పటికే సగం మంది ఉపాధిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చెమరు కొరతను నివారించి వినియోగదారులకు సిలిండర్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ వ్యక్తం చేశారు

# ఇందిరమ్మ ఇండ్లపై ఎంపీడీఓ సమీక్ష సమావేశం





**వెల్దండ మార్చి 18 (అక్షర గళం)** వెల్దండ మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ కృష్ణయ్య సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హౌసింగ్ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చర్య తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తిచేసేలా అభ్యర్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఏప్రిల్ 20 నాటికి మండలంలో కనీసం 100 ఇండ్లు గృహప్రవేశం చేసేటట్లు లబ్ధిదారులను చైతన్య పరిచి ఎక్కువ సంఖ్యలో గృహప్రవేశం చేసేటట్లు అధికారులు ప్రత్యేక చర్య తీసుకోవాలని ఎంపీడీవో ఈసం కృష్ణయ్య ఎంపీ ఓ లక్ష్మణ్ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్..

### దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు,మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మహిళా విభాగం బీ బ్లాక్ అధ్యక్షురాలు ఈగ శ్వేత రాజు ముదిరాజ్ చేతుల మీదుగా ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ





**కీసర, మార్చి 18,(అక్షర గళం)** :ఆత్మీయత, మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అని దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు తెలిపారు.రంజాన్ పండుగను పురస్కరించుకొని బుధవారం ఆర్ జి కె కాలనీలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మహిళా విభాగం బీ బ్లాక్ అధ్యక్షురాలు ఈగ శ్వేత రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముప్పా రామారావు, కీసరగుట్ట ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద్ గౌడ్ హాజరై రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముప్పా రామారావు మాట్లాడుతూ...రంజాన్ మాసంలో పేద ముస్లిం కుటుంబాలు సైతం సంతోషంగా పండగ జరుపుకునేందుకు ప్రభుత్వం రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేస్తుందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నాణ్యమైన కొత్త బట్టలను అందించారని ఆయన అన్నారు. ముస్లింల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తుందని తెలిపారు. అర్హులైన వారందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ జి కే కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి,ముదిరాజ్ సంగం అధ్యక్షుడు ఈగ రాజు ముదిరాజ్ , రమేష్, షేక్ రషీద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో 100 పడకల ఆసుపత్రి పనులపై కలెక్టర్ పరిశీలన నాణ్యతతో, గడువులో పూర్తి చెయలాని అధికారులకు ఆదేశాలు

- షెడ్యూల్డ్ కులాలకు 36 షాపింగ్ కాంప్లెక్స్‌ల కేటాయింపు..
- కల్వకుర్తిలో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష..
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్..





**కల్వకుర్తి, మార్చి 18 (అక్షరగళం)**:నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం కల్వకుర్తి పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి, ఇప్పటివరకు పూర్తైన పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి రాజీ పడకుండా నిర్మాణాన్ని కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, అవసరమైన వనరులు సమకూర్చి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు ఈ ఆసుపత్రి కీలకమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో షెడ్యూల్డ్ కులాలకు కేటాయించాల్సిన 36 షాపింగ్ కాంప్లెక్స్‌లను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటికే విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం డ్రా విధానంలో షాపుల కేటాయింపు ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ముస్లిం మహిళలకు రంజాన్ కిట్ పంపిణీ



కల్వకుర్తి మార్చి 18 (అక్షర గళం) రంజాన్ పండుగను పురస్కరించుకొని మున్సిపల్ చైర్స్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణానికి చెందిన వెయ్యి మంది నిరుపేద ముస్లిం లకు రంజాన్ కిట్ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఏడాది రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు నిత్యావసర సరకులకు సంబంధించిన వస్తువులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు

### మద్యం తాగి వాహనం నడిపితే

## జైలు శిక్ష కల్వకుర్తి ఎస్ఐ



కల్వకుర్తి మార్చి 18 (అక్షర గళం) మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడిన వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష, వంద రూపాయలు జరిమానా అందించినట్లు ఎస్సై మాధవరెడ్డి బుధవారం సాయంత్రం తెలిపారు. మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన పండుగ చంద్రయ్య అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపరచగా రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. మరో వ్యక్తికి 1400 ఫైన్ వేశారు.

## మున్సిపల్ వేలం పాటలు పూర్తి..

### తై బజార్కు రూ.32 లక్షలు



కల్వకుర్తి మార్చి 18 (అక్షర గళం) పట్టణ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్పర్సన్ బృంగి రత్నమాల, కమిషనర్ మహమూద్ షేక్, వైస్ ఛైర్మన్ శానవాజ్ ఖాన్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు బహిరంగ వేలం నిర్వహించారు. పారదర్శకంగా జరిగిన ఈ వేలంలో పలువురు కాంట్రాక్టర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. మున్సిపల్ ఆదాయాన్ని మెరుగుపరిచేందుకు, పట్టణ పరిశుభ్రత కోసం ఈ వేలం ప్రక్రియ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.

### ఘనంగా బచ్పన్ స్కూల్ వార్షికోత్సవ దినోత్సవం



**కల్వకుర్తి మార్చ్ 18 (అక్షర గళం)** కల్వకుర్తి పట్టణంలోని డిపిఎస్ బచ్పన్ స్కూల్ వారు నిర్వహించిన వార్షికోత్సవ దినోత్సవాన్ని బుధవారం రాత్రి పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాధికారి రమేష్, ఎంఈఓ శంకర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ షేక్ మహమ్మద్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ రత్నమాల, కల్వకుర్తి సీఐ నాగార్జున, ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్,,ా× లు మాధవ రెడ్డి, వెల్దండ ఎస్ఐ కురుమూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ టిషా, పాఠశాల సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

## స్వీపర్లకు రిక్షాలు పంపిణీ చేసిన ఎంపీపీ

**బ్రహ్మంగారిమఠం** బ్రహ్మంగారిమఠం మండలంలోని గ్రామపంచాయతీలకు పంచాయతీ లోని స్వీపర్లకు ఆటోరిక్షాను అలాగే చెత్తను సేకరించుటకు ప్లాస్టిక్ బకెట్లను బుధవారం మండల ఎంపీపీ వీరనారాయణరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు సుబ్బారెడ్డి,జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, గొడ్లవీడు సర్పంచ్ చెన్న కృష్ణారెడ్డి, ఎస్సార్ శ్రీనివాసులురెడ్డి,సాంబశివారెడ్డి, మండల ఎంపీడీవో వై.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జెండా ఊపి చెత్త సేకరించు రిక్షాలను అందించారు. అలాగే స్వచ్ఛ రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ స్వచ్ఛ రథము మండలంలోని గ్రామాలలో తిరిగి, పనికి రాని ఇనుము,ప్లాస్టిక్,పాత పుస్తకాలు తదితర వస్తువులను సేకరించి రథంలో ఉన్న మనకు కావలసిన వస్తువులను తీసుకొనవచ్చని ఎంపీడీవో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నరసింహ గౌడ్,పూజ శివయ్య,పెరుగు నాగేంద్ర,రామాంజనేయులు,చంద్ర తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 అమలు చేయుటకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీసీసీ సమావేశం



**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి :** జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్., మేడ్చల్ మల్కాజిగిరి ఆధ్వర్యంలో ప్రత్యేక బ్యాంకర్ల (డీసీసీ) సమావేశము ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అధ్యక్షతన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ యాక్షన్ ప్లాన్ కింద ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా యూనిట్ల స్థాపన చేపట్టుటకు కార్యాచరణను బ్యాంకర్ల సమావేశంలో చర్చించారు. 1.00 లక్ష రూపాయల విలువ గల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన యూనిట్లు 90% సబ్సిడీతో అందించబడుచున్నవి. ప్రస్తుతం గిగ్ వర్కర్లుగా ఆన్ లైన్ ప్లాట్ ఫార్మ్ అయినటువంటి జొమాటో, స్విగ్గి, ర్యాపిడో మొదలైన వాటిలో పనిచేస్తున్న వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని అదనపు కలెక్టర్ గారు తెలియజేశారు. 3.00 లక్షల రూపాయల విలువ గల గూడ్స్/ప్యాసింజర్ త్రీ వీలర్ యూనిట్లు 70% సబ్సిడీతో మంజూరు చేయబడతాయన్నారు. . ఈ వాహనాల ద్వారా వారు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా 3.00 నుండి 7.00 లక్షల విలువ గల సోలార్ యునివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు 60% సబ్సిడీతో మంజూరు చేయబడతాయి. ఈ పథకం ద్వారా ముఖ్యంగా ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఉంచారు. షెడ్యూల్డు కులాల రైతులు సోలార్ యునివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు ఈ పథకం కింద 215 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, 106 త్రిచక్ర వాహనాల యూనిట్లు 22 సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు కేటాయించబడినట్లు తెలిపారు. ఈ యూనిట్లను త్వరితగతిన గ్రౌండింగ్ చేయడంలో బ్యాంకర్లు చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం ఆఖరు తేదీ 24.03.2026 లోగా అర్హులైన ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని, బ్యాంకులు వాటిని వేగంగా పరిశీలించి రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించడంపై బ్యాంకార్లు, అధికారులు ప్రత్యేక దృష్టి ఉంచాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఆదేశించారు. ఈ ప్రత్యేక బ్యాంకర్ల సమావేశానికి కె. బాబు మొజెస్, కార్యనిర్వాహక సంచాలకులు, ఎస్సీ కార్పొరేషన్ సి. శివ ప్రసాద్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ల ఆధ్వర్యంలో ఎస్బీఐ, యుబీఐ,. కెనార బ్యాంక్, పీఎన్బి, టీజీవిబీ, తదితర బ్యాంకులకు సంబంధించి జిల్లా కంట్రోలర్లు , కొఆర్డినేటర్లు హాజరయ్యారు..

### వెల్జాల్ లో విజయవంతమైన

## ఉచిత ఆరోగ్యం శిబిరం





కల్వకుర్తి మార్చి 18 (అక్షర గళం) కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండల పరిధిలో వెల్జాల్ గ్రామంలో బుధవారం కామినేని హాస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం విజయవంతమైంది. కామినేని హాస్పిటల్ డాక్టర్స్, డాక్టర్ చందన, లింగా స్వామి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సందీప్ తో కలిసి ప్రారంభించిన స్థానిక సర్పంచ్ శ్రీ. వానరాశి రాములమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ సీ.ఎల్. శ్రీనివాస్ యాదవ్, ఉచిత ఆరోగ్య శిబిరంలో 130 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి కంటి పరీక్షలు, కీళ్ల నొప్పులు, సర్ది, జ్వరం, దగ్గు,లాంటి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి వైద్య సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గ్రామ ఉపసర్పంచ్ శివ విజయలక్ష్మి విజయ్ కుమార్, మాజీ జెడ్పి కోఆప్షన్ ముజీబుర్ రహమాన్ మాజీ ఎంపీటీసీలు జి శ్రీనివాసమూర్తి, ఎం అంబాజీ, మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ అంజయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్ లు బి నర్సింలు అజీజ్, వార్డు సభ్యులు వి.శేఖర్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ కృష్ణయ్య గౌడ్, మండల కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, నాయకులు పి అశోక్ బాబు, వానరాశి వెంకటేష్, ఏ వెంకట్ రెడ్డి, ఎం బాలకిష్టయ్య, వద్దే రాజు, సి లింగం యాదవ్, పులిజాల విష్ణు, పిరికేటి దశరథం, టీ రాఘవేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రతే ముఖ్యం...

- రంగంలోకి దిగిన ఆర్టీవో అధికారులు..
- బస్సుల ఫిట్‌నెస్ పరిశీలన...



**రేణిగుంట** విద్యార్థుల భద్రతే ధ్యేయంగా తిరుపతి ఆర్టీవో మురళీమోహన్ ఆదేశాల మేరకు రేణిగుంట పట్టణంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు (బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు) బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులను నిలిపివేసి క్షుణ్ణంగా పరిశీలించారు. బస్సుల్లో ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పర్మిట్ పత్రాలను అధికారులు తనిఖీ చేశారు. విద్యార్థుల రక్షణ కోసం బస్సుల్లో అత్యవసర ద్వారం, ప్రథమ చికిత్స కిట్ మరియు అగ్నిమాపక పరికరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. వాహనం నడిపే సమయంలో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘించే స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడితే యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గోవధ చట్టం అమలు చేయాలి




**జగిత్యాల** గోవధ చట్టం 1977 ప్రకారం చర్యలు తీసుకోవాలని జగిత్యాల హిందూ ఐక్య వేదిక డిమాండ్ చేసారు. తెలంగాణలో గోవధ పై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేని ఎడల హిందూ ఐక్యవేదిక ద్వారా పెద్ద ఎత్తున అన్ని కులాల సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా హిందు వాహిని సభ్యులు వేముల సంతోష్, కైలాష్ పతి, హరీష్, మహేష్, వెంకటేష్, దశరథం, నగేష్, రాజేందర్, వంజరి సంఘం నుండి ఆంజనేయులు పద్మశాలి సేవా సంఘం నుంచి బోగ గంగాధర్, గట్ల ప్రతాప్, మురళి, మునిందర్, వీరబత్తిని అనిల్, శ్రీనివాస్, నరేష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు..

### వందమంది నిరుపేద ముస్లిం

## కుటుంబాలకు రంజాన్ తోఫా

**కర్నూలు :** అల్లాహ్ మార్గాన్ని అనుసరించి రంజాన్ మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయం అని విజయ మిల్క్ డైరీ మాజీ డిప్యూటి డైరెక్టర్ డిఎం.వలి అన్నారు. కర్నూలు పట్టణంలోని స్కంద హైబిస్కస్ నందు బుదవారం ఉల్చాల రోడ్, ఎన్టీఆర్ కాలనీ, బిల్డింగ్స్, నెహ్రూ ఆటో నగర్, రేడియో స్టేషన్ ప్రాంతాల్లో వుండే వంద మంది నిరు పేద ముస్లిం కుటుంబాలకు వివిధ రకాలైన సరుకులు బియ్యం, సేమియా, నెయ్యి, మంచి నూనె, గోడంబి, ద్రాక్ష, బాదం, చక్కెర, కొబ్బర ఇతర నిత్యవసర సరుకులు వలి కుటుంబ సభ్యులు కలిసి రంజాన్ తోఫాను అందజేశారు. ఈసందర్భంగా మాజీ డిప్యూటీ డైరెక్టర్ వలి మాట్లాడుతూ నిరుపేద ముస్లింలు సైతం పండుగను ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా రంజాన్ తోఫా అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఖుర్షీద్, రహీంభి, షీఫా, జుఫీష తదితరులు పాల్గొన్నారు.

## పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు

- ఈ జిల్లాల ప్రజలకు వాతావరణశాఖ హెచ్చరిక..



**తిరుపతి** ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాలకు వాతావరణశాఖ వర్షసూచన జారీ చేసింది. పలు ప్రాంతాల్లో భారీ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రాష్ట్రంలో వాతావరణం మారింది. భిన్న వాతావరణ పరిస్థితులు ఏపీలో నెలకొంటున్నాయి. మొన్నటివరకు ఎండ తీవ్రత కొనసాగగా.. రెండ్రోజుల నుంచి ఆకాశంలో మబ్బులతో పాటు చిన్నపాటి వర్షపు చినుకులు పడుతున్నాయి. పలు జిల్లాల్లో కురుస్తున్న చిరు జల్లులతో ఎండ ప్రభావం నుంచి ప్రజలకు చల్లని ఊరటనిస్తుంది. భానుడి ప్రతాపం నుంచి కొంత ఉపశమనం లభించింది. కొన్ని జిల్లాల్లో స్వల్ప వర్షాలు కురుస్తుండగా.. మరికొన్ని జిల్లాల్లో ఎండలు కొనసాగుతున్నాయి. పలు జిల్లాల్లో వర్షాలకు సంబంధించివాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. కొన్ని జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికలు కూడా ఇచ్చింది. వాతావరణశాఖ అంచనాల ప్రకారం రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం ఎలా ఉంటుందో చూద్దాం. రాబోయే నాలుగు రోజుల పాటు వర్షాలు పడతాయని హెచ్చరించింది. కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు ద్రోణి ఏర్పడిందని, దీని ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది.

**- ఈ జిల్లాలకు వర్షసూచన** ఏపీలోని పలు జిల్లాలకు ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ రెయిన్ అలర్ట్ జారీ చేసింది.

పోలవరం, అల్లూరి సీతారామరాజు, నెల్లూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఇక మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని అంచనా వేసింది. పిడుగులు పడే అవకాశం ఉన్న క్రమంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని సూచించింది. వర్షాల క్రమంలో వచ్చే నాలుగు రోజుల పాటు కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయని తెలిపింది. రెండు, మూడు డిగ్రీలు ఎండలు తగ్గుతాయని స్పష్టం చేసింది.

# పాన్‌తో ఆధార్ లింక్

## - మార్చి 31 వరకు గడువు

**న్యూఢిల్లీ:** కొత్త పాన్ కార్డు పొందాలనుకుంటే దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు కాపీని జత చేస్తే సరిపోతుంది. అయితే రాబోయే ఆర్థిక సంవత్సరం నుంచి అలా కుదరదు. ఏప్రిల్ 1వ తేదీ తర్వాత కొత్త పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్ కార్డుతో పాటు అదనపు డాక్యుమెంట్లను కూడా జత చేయాల్సి ఉంటుంది. కేవలం ఆధార్‌తోనే పాన్ పొందాలనుకుంటే మాత్రం మార్చి 31వ తేదీయే తుది గడువు అని కేంద్రానికి చెందిన కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది. బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి పాన్ కార్డు అత్యంత కీలకమనే సంగతి తెలిసిందే. ఇప్పటివరకు నూతన పాన్ కార్డు కోసం ఆధార్ కార్డు కాపీ ఇస్తే సరిపోయేది. అయితే ఏప్రిల్ 1 నుంచి ఆధార్‌తో పాటు బర్త్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ కార్డు, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ వంటి వాటిల్లో ఏదో ఒకటి జత చేయాల్సి ఉంటుంది. ఎప్రిల్ ఒకటి తర్వాత పాత పాన్ దరఖాస్తు ఫారాలను కూడా అనుమతించేది ఉండదని కామన్ సర్వీస్ సెంటర్ పేర్కొంది. ఏప్రిల్ 1 నుంచి పాన్ దరఖాస్తు ఫారాలు కూడా మారతాయని, కొత్తవి అందుబాటులోకి వస్తాయని కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది. అలాగే ఆన్‌లైన్‌లో కొత్త పాన్ కార్డు దరఖాస్తు కోసం బీబితితిబిబ ÷ఔజీని, ఖసనీబిIజీని వెబ్‌సైట్లను సందర్శించాలని పేర్కొంది.

# ఇరాన్‌కు వరుస ఎదురు దెబ్బలు

## - ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ హతం
## - ప్రకటించిన ఇజ్రాయిల్ రక్షణమంత్రి

**టెహ్రాన్:** సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనే మరణం తర్వాత ఇరాన్‌కు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. టెహ్రాన్‌పై రాత్రికి రాత్రి జరిపిన దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ మృతి చెందినట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ బుధవారంనాడు ప్రకటించారు. ఇరాన్ సీనియర్ అధికారులు ఎవరినైనా సరే ఎలాంటి అదనపు అనుమతులు అవసరం లేకుండా మట్టుబెట్టాలని మిలిటరీకి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు స్వేచ్ఛనిచ్చినట్టు ఆయన తెలిపారు. అయితే ఇస్మయిల్ ఖతీబ్ మృతి వార్తలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, ఇస్మయిల్ ఖతీబ్ మృతికి ఒక రోజు ముందే ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ సైతం ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. ఆయనతో పాటు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కోర్(ఐఆర్‌జీసీ) పారామిలిటరీ దళం 'బసిజ్ ఫోర్స్' కమాండర్ గోలం రెజా సోలేమానీ, పెద్ద సంఖ్యలో మిలిటరీ ఉన్నతాధికారులు తమ దాడుల్లో మృతిచెందినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఆదేశంలోని 100 టార్గెట్లను లక్ష్యంగా చేసుకున్నట్టు ఇరాన్ తెలిపింది. ఉద్రిక్తతలను తగ్గించే ప్రతిపాదనను ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తోసిపుచ్చారు. శాంతికి ఇది సమయం కాదని, ఓటమిని అంగీకరించి నష్టపరిహారం ఇచ్చేంతవరకూ అమెరికా, ఇజ్రాయెల్‌తో శాంతి కుదరదని చెప్పారు.

# అక్కను హత్య చేసిన తమ్ముడు

## - పోలీస్ విచారణలో నేరం అంగీకారం

**హైదరాబాద్,:**రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో దారుణం చోటుచేసుకుంది. అక్క ప్రవర్తన సరిగా లేదనే కోపంతో ఆమెను తమ్ముడు హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలు చేసి చెరువులో పడేశాడు. కొన్నాళ్ల క్రితం భర్త చనిపోవడంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఆ తర్వాత ఆమె ప్రవర్తనలో మార్పును తమ్ముడు పప్పు రామ్ గమనించాడు. తీరు మార్చుకోవాలని చెప్పినా.. వినిపించుకోకపోవడంతో ఆమెను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రెండు ముక్కలుగా చేసి మజీద్‌పుర్ చెరువులో పడేశాడు. గత నెల 28న ఆమె బాటసింగారంలోని కిరాణ దుకాణానికి వెళ్లి కనిపించకుండా పోయినట్లు పోలీస్ స్టేషన్‌లో తమ్ముడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టడంతో హత్య వ్యవహారం బయటపడింది.

# దమ్ముంట ఎన్‌కౌంటర్ చేయండి

## - పోలీసులకు సవాల్..ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ హతం
## - బీహార్ చంపారణ్‌లో ఘటన

**పాట్నా:**తనను ఎన్‌కౌంటర్ చేసేందుకు ప్లేసు, టైం చెప్పాలంటూ ఒక గ్యాంగ్‌స్టర్ పోలీసులకు సవాల్ విసిరాడు. తర్వాత పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఈ ఘటన బిహార్‌లోని చంపారణ్ జిల్లా మోతిహరి పట్టణ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రాంతంలో కుందన్ ఠాకూర్ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ అనేక నేరాలకు పాల్పడ్డాడు. దీంతో అతడిపై పలు కేసులు నమోదయ్యాయి. కొంతకాలంగా ఠాకూర్, అతడి గ్యాంగ్ అజ్ఞాతంలో ఉన్నారు. ఇటీవల ఠాకూర్ పోలీసులకు సవాల్ విసిరాడు. వారిని హెచ్చరిస్తూ ఆడియో సందేశాలు పంపాడు. ముఖ్యంగా చకియా పోలీస్ స్టేషన్ ఆఫీసర్‌కు నేరుగా హెచ్చరికలు జారీ చేశాడు.

తనను పట్టుకునేందుకు ఎంత మంది పోలీసులు వచ్చినా వారి అంతుచూస్తానని, దమ్ముంటే ప్లేస్, టైం చెప్పాలంటూ సవాల్ విసిరాడు. తనను ఎన్‌కౌంటర్ చేయాలనుకుంటే ఎందరో పోలీసుల ప్రాణాలు పోతాయని హెచ్చరించాడు. పోలీసులు తన కుటుంబాన్ని వేధిస్తున్నారని, వాటిని ఆపకుంటే తాను కూడా పోలీసుల కుటుంబాల అంతు చూస్తానని వార్నింగ్ ఇచ్చాడు. తాను పారిపోవడం లేదని, ఎన్‌కౌంటర్‌లో ఎంతమంది పోలీసులొచ్చినా ఎదుర్కొంటానన్నాడు. ఇది హెచ్చరిక కాదని, సలహా మాత్రమే అని చెప్పుకొచ్చాడు. అయితే, అప్పటికే అతడి కదలికలపై నిఘా పెట్టిన పోలీసులకు తగిన సమాచారం అందింది. ఠాకూర్, అతడి అనుచరులు ఉన్న ప్రదేశం గురించి సమాచారం అందుకున్న ప్రత్యేక బృందం ఆ ప్రదేశాన్ని చుట్టుముట్టింది. ఈ క్రమంలో ఠాకూర్ గ్యాంగ్ రెచ్చగొట్టే చర్యలకు దిగింది. దీంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఇరుపక్షాల మధ్య జరిగిన కాల్పుల్లో ఒక ఎస్టీఎఫ్ జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయాడు. తమ సహచరుడు మరణించినప్పటికీ పోలీసులు ఠాకూర్ అండ్ గ్యాంగ్‌కు వ్యతిరేకంగా కాల్పులు జరిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో కుందన్ ఠాకూర్‌తోపాటు మరో ఇద్దరు క్రిమినల్స్ కూడా హతమయ్యారు.

# మదనపల్లి ఫైల్స్ దహనం కేసు

## - పెద్ది రామంద్రారెడ్డి పిఎ, అనుచరుడి అరెస్ట్

**తిరుపతి:**తిరుపతి జిల్లా మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏగా వ్యవహరించిన ముని తుకారాం, ప్రధాన అనుచరుడు మాధవరెడ్డిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. నాయకులతో కలిసి కాఫీ తాగేందుకు వచ్చిన ఇరువురిని చంద్రగిరి మండలం పనపాకం టోల్ ఎ÷–లాజా వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తిరుపతిలోని సీఐడీ కార్యాలయానికి తరలించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో 2024 జులై 21న్గ÷ల్స్ తగులబెట్టారు. ఈ కేసులో ఏ3గా మాధవరెడ్డి, ఏ4గా ముని తుకారాం ఉన్నారు. ఈ ఇద్దరు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఇటీవల వారికి అక్కడ చుక్కెదురైంది. ఈ నేపథ్యంలో సీఐడీ పోలీసులు బుధవారం వారిని అరెస్ట్ చేశారు.

# ఎస్ఐ భార్య ఆత్మహత్య

**కరీంనగర్:**కరీనంగర్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. కరీంనగర్ టూ టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. విషపూరితమైన గన్నేరు పప్పు తినడంతో తీవ్ర అస్వస్థతకు గురైన దివ్యను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, చంద్రశేఖర్, దివ్య దంపతులకు ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. దివ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# తండ్రీ కూతుళ్లను హత్య చేసిన అల్లుడు

## - ఆపై పెట్రోల్ పోసి తగులబెట్టిన దుండగుడు

**హన్మకొండ:**హనుమకొండ జిల్లాలో ఘోరం జరిగింది. అనుమానాస్పద రీతిలో తండ్రి, కుమార్తె సజీవదహనమై కనిపించారు. కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్పలో బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మృతులను రాజశేఖర్ (54), రాజశ్రీ (24)గా గుర్తించారు. కాగా, రాజశ్రీకి 2023లో ప్రవీణ్ అనే యువకుడితో వివాహం జరిగింది. వీరికి ఒక పాప, బాబు కూడా ఉన్నారు. అయితే కుటుంబ కలహాల కారణంగా ప్రవీణ్.. వారిద్దరి ఒంటిపై డీజిల్ పోసి నిప్పు పెట్టినట్లుగా అనుమానిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదుతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. వేలిముద్రలు, ఇతర ఆధారాలను పోలీసులు సేకరించారు. ఇక ప్రవీణ్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే ప్రవీణ్ ఈ నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# యూరియా యాప్‌తో రైతులకు నానా యాతన

## - అసెంబ్లీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల

**హైదరాబాద్:** కాంగ్రెస్ సర్కారు యూరియా యాప్ పేరుతో రైతులను వేధిస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. రాష్ట్రంలో 50 శాతం మంది రైతుల దగ్గర స్మార్ట్‌ఫోన్‌లు లేవని, ఇక స్మార్ట్ ఫోన్‌లు ఉన్న 50 శాతం మందిలో కూడా 50 శాతం మందికి యాప్‌ను ఎలా ఉపయోగించాలో తెలియదని అన్నారు. ఇలా మొత్తంగా 75 శాతం మంది రైతులు యూరియా యాప్‌తో ఇబ్బందులు పడుతున్నారని వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. వారంతా మీ సేవా కేంద్రాలకు పోయి యూరియా బుక్ చేయించుకోవాల్సి వస్తున్నదని తెలిపారు. ఆ తర్వాత మరో రోజు వెళ్లి యూరియా తెచ్చుకోవాల్సి వస్తుందని అన్నారు. ఇలా రెండు రోజులు సమయం రైతుకు వృథా అవుతున్నదని చెప్పారు. ఇక ఒక దఫాలో 5 బస్తాల కంటే ఎక్కువ యూరియా ఇవ్వడంలేదని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. దాంతో మూడు నాలుగు ఎకరాల్లో మక్క పంట వేసిన రైతు మూడు దఫాల్లో రెండేసి రోజుల చొప్పున మొత్తం ఆరు రోజులు యూరియా కోసం తిరగాల్సి వస్తున్నదని చెప్పారు. మండలానికి ఒక్క కేంద్రంలో మాత్రమే యురియా ఇస్తుండటంతో చాలా గ్రామాల రైతులు ఎక్కువ దూరం వెళ్లాల్సి వస్తుందని అన్నారు. కాబట్టి మండలానికి ఒక్కచోట మాత్రమే కాకుండా ఎక్కువచోట్ల యూరియా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. దఫాకు 5 బస్తాల పరిమితిని ఎత్తేసి, రైతు వేసిన పంటకు ఎంత యూరియా అవసరమో అంతా ఒకేసారి ఇవ్వాలన్నారు.

# బడ్జెట్‌లో బిసిలకు 50శాతం కేటాయింపు

## - ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి
## - అసెంబ్లీలో మాజీమంత్రి తలసాని

**హైదరాబాద్:** జనాభా లో 50 శాతం ఉన్న బీసీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం బీసీల సంక్షేమానికి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండు బడ్జెట్‌లు అయిపోయాయని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ. 10 వేల కోట్ల వరకు ఉన్నాయని, వెంటనే వాటిని ప్రభుత్వం చెల్లించాలని కోరారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల కారణంగా అనేకమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే బీసీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు జ్యోతిరావు పూలే ఓవర్సీస్ కార్యక్రమాన్ని కేసీఆర్ తీసుకొచ్చారని, ఆ పథకం క్రింద అర్హులైన విద్యార్థులకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బీసీ వర్గాలను చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీలో బిల్లు పెడితే చట్టబద్దత రాదని, కేంద్ర ప్రభుత్వం 9 వ షెడ్యూల్ లో చేరిస్తేనే చట్టబద్దత వస్తుందన్న విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తే పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు హాజరుకాకపోవడం బీసీల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. బీసీ సమస్యల పై కాంగ్రెస్ పార్టీలోని బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

# ఆర్టీ ఉద్యోగులకు సంస్థ షాక్

## - ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్ రద్దు

**హైదరాబాద్,:**ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బిగ్ షాక్ ఇచ్చింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద ఇచ్చే స్పెషల్ ఇంక్రిమెంట్‌ను రద్దు చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది.

ఆర్టీసీ బోర్డు తీర్మానం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇకపై ఉద్యోగులు, వారి జీవిత భాగస్వామి.. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నా ఈ ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వబోమని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీఎస్‌ఆర్టీసీ సర్క్యులర్ జారీ చేసింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద స్పెషల్ క్యాజువల్ లీవ్ మాత్రమే కొనసాగుతుందని తెలిపింది. ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. గతంలో ఈ స్కామ్ ద్వారా కుటుంబ నియంత్రణను ప్రోత్సహించేవారు.

# అకాల వర్షంతో పంటలకు తీవ్ర నష్టం

**కరీంనగర్,:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గత అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షానికి పలుచోట్ల పెద్దఎత్తున పంట నష్టం తలెత్తింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

పెద్దపెల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి, మంగపేటల్లో తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న పంట నేలరాలింది. కరీంనగర్ జిల్లా వీణవంకలోనూ అపార పంటనష్టం జరిగింది. నర్సింగాపూర్‌లోనూ మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతింది. కొన్ని చోట్ల మామిడి పిందెలు రాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో గత రాత్రి కురిసిన వడగండ్ల వానకు.. చేతికొచ్చిన పంట నేలరాలింది. భారీగా పంట నష్టం తలెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. అకాల వర్షానికి మిర్చి రైతులు విలవిలలాడారు. మిర్చి కుప్పలపై టార్పాలిన్లు కప్పి పంటను కాపాడుకుంటున్నారు రైతులు.

# భీమదేవరపల్లిలో వ్యవసాయాధికారలు పర్యటన

హన్మకొండ,:హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వీర్లగడ్డ తండా గ్రామంలో బుధవారం వరి పొలాలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు గోన్యా నాయక్, పద్మజ, హనుమకొండ డివిజన్ ఏడీఏ ఆదిరెడ్డి, భీమదేవరపల్లి మండల వ్యవసాయ అధికారి పద్మ సందర్శించారు. వరి పొలాలలో కంకినల్లిని ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ సందర్భంగా పలు రసాయనాలు వర్షాలు తగ్గిన తరువాత పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. మరో పది రోజులలో వచ్చి వరి పొలాలని మరల పరిశీలిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం వ్యవసాయాధికారులు అచ్యుత్ రెడ్డి, స్వామి రావు, ప్రశాంత్, వీర్లగడ్డ తండా గ్రామ సర్పంచ్ గుగ్లోతు పూర్ణిమ, రైతులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో వైభవంగా ఉగాది మహోత్సవాలు

## - అగ్నిగుండాల్లో నడిచిన కన్నడ భక్తులు

**నంద్యాల:** శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మూడోరోజు వీరాచార విన్యాసాలు, అత్యంత భక్తిశ్రద్ధలతో కూడిన, ఒళ్లు గగుర్పొడిచే ఘట్టం అగ్నిగుండ ప్రవేశం జరుగుతోంది . ముఖ్యంగా కర్ణాటక నుంచి వచ్చే వీరశైవ భక్తులు ఈ క్రతువును భక్తి పారవశ్యంతో నిర్వహిస్తారు. కన్నడ భక్తులు తమ ఆరాధ్య దైవమైన మల్లికార్జున స్వామిపై ఉన్న భక్తిని చాటుకోవడానికి నిప్పు కణికలపై నడుస్తారు. ఈ భక్తులు ఉగాదికి కొన్ని రోజుల ముందు నుండే కఠినమైన దీక్ష చేపట్టి, పాదయాత్రగా శ్రీశైలం చేరుకుంటారు. అగ్నిగుండంపై నడవడం వల్ల తమ పాపాలు తొలగిపోతాయని, స్వామివారి అనుగ్రహం లభిస్తుందని వారి నమ్మకం. వీరశైవ సంప్రదాయంలో శివుడిని 'వీరభద్రుడి' రూపంలో ఆరాధిస్తారు. దక్ష యజ్ఞాన్ని ధ్వంసం చేసిన వీరభద్రుని ఆవేశానికి ప్రతీకగా భక్తులు ఈ విన్యాసాలు చేస్తారు. ఇందులో భాగంగా భక్తులు తమ శరీరాన్ని కష్టపెట్టుకుంటూ భక్తిని ప్రదర్శిస్తారు. మార్చి 16 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు 20 వరకు జరగనున్నాయి. మొదటి రోజు ధ్వజారోహణం, భృంగి వాహన సేవ, రెండవ రోజు కైలాస వాహన సేవ, మూడో రోజు రావణ వాహన సేవ, నాలుగవ రోజు (ఉగాది)న రథోత్సవం, నంది వాహన సేవ, పంచాంగ శ్రవణం, ఐదవ రోజు ధ్వజావరోహణం, పూర్ణాహుతి, పుష్ప పల్లకి సేవ జరగనుంది. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఇప్పటికే కన్నడ, మహారాష్ట్ర భక్తులకు పాదయాత్ర మార్గంలో.. క్షేత్రంలో పలుచోట్ల చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు తాగు నీటికి ఎలాంగి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నారు.

# నగరంలో కల్తీపన్నీర్ తయారీ

## - దాడి చేసి పట్టుకున్న అధికారులు

**హైదరాబాద్,:** కారం, చాయపత్త, పన్నీర్ ఇలా పలు రకాల ఆహార పదార్థాలను పలు రకాల రసాయనాలను ఉపయోగించి కల్తీ ఆహారపదార్థాలను తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారు కొందరు కేటుగాళ్లు. ఈజీగా మనీ సంపాదించుకునేందుకు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తాజాగా సికింద్రాబాద్ లోని మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో వేల కిలోల్లో కల్తీ పన్నీర్ బయటపడడంతో అధికారులతో సహా అంతా షాక్ అయ్యారు. కల్తీ పన్నీర్ తయారీ కేంద్రంపై ఫుడ్ ఇన్స్పెక్టర్ తో సహా ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు వేల కిలోలకు పైగా కల్తీ పన్నీర్ ను సీజ్ చేశారు ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు. శ్రీ బాలాజీ డైరీ ప్రొడక్ట్స్, విజయ్ మిల్క్, కర్డ్ షాపు తో సహా ఆరు షాపులపై దాడులు చేశారు. శ్రీ బాలాజీ డైరీ ప్రొడక్ట్స్ లో 1600 కిలోల పన్నీర్ ను సీజ్ చేశారు. విజయ్ మిల్క్ అండ్ కర్డ్ షాప్ లో1000 కిలోల కల్తీ పన్నీర్ సీజ్ చేశారు. నిర్వాహకులు నగరంలో పలు ప్రాంతాల్లో కల్తీ పన్నీరు అమ్ముతున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

# చంద్రబాబు ఫోటోకు అగౌరవం

## - కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వర్మ

కాకినాడ,మార్చి18(ఆర్ఎన్ఎ):పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత శ్రీవత్సవాయి సత్యనారాయణ వర్మ తరచూ వార్తల్లో ఉంటారు.. కాకినాడ జిల్లా కలెక్టర్ ను కలిసి పిఠాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటోకు ప్రోటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు చేశారు.. సీఎం చంద్రబాబు నాయుడు ఫోటోను రెవెన్యూ స్టాంప్ సైజులో ఏర్పాటు చేసి అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని మండిపడ్డారు. అధికారులకు జ్ఞాపకశక్తి ఉండడం లేదని, సీఎం చంద్రబాబు ఫోటో ఏ సైజులో ఉండాలో వారికి ప్రోటోకాల్ తెలియడం లేదని కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు.. ఒక మెమో జారీ చేసి అధికారులకు ఆ విషయంపై క్లారిటీ ఇవ్వాలని కలెక్టర్ ను కోరారు.. సీఎం చంద్రబాబు ఫోటో లేకుండా కార్యక్రమాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని అన్నారు వర్మ.. గత వారంలో పిఠాపురంలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేసి వేదిక మీద నుంచి కిందకు దిగిపోయారు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ.

# లాంగ్ వీకెండ్‌లో ప్రైవేట్ బాదుడు

## - బస్సుల్లో ఇబ్బడిముబ్బడిగా రేట్లు

**హైదరాబాద్ :**సామాన్యుడికి సొంతూరి ప్రయాణం భారంగా మారుతోంది. వరుస సెలవులు రావడంతో నగరాల్లో నివసించే ఉద్యోగులు, విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు దీనిని అదునుగా చేసుకుని ఛార్జీలను అడ్డగోలుగా పెంచేస్తున్నాయి. మార్చి 19న ఉగాది, 21న రంజాన్, 22న ఆదివారం కావడంతో మధ్యలో ఉన్న శుక్రవారం ఒక్క రోజు సెలవు పెడితే వరుసగా నాలుగు రోజులు పండుగను కుటుంబంతో గడపవచ్చని చాలామంది ప్రణాళికలు వేసుకున్నారు. అయితే.. ఆర్టీసీ బస్సులు, రైళ్లలో రిజర్వేషన్లు ఎప్పుడో నిండిపోవడంతో ప్రయాణికులకు ప్రైవేట్ ట్రావెల్స్ మాత్రమే ప్రత్యామ్నాయంగా మిగిలాయి. దీనిని ఆసరాగా చేసుకున్న కొన్ని సంస్థలు సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. సాధారణ రోజుల్లో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ బస్సు ఛార్జీ సుమారు రూ. 1,500 నుంచి రూ. 2,000 మధ్య ఉంటుంది. కానీ ఈ లాంగ్ వీకెండ్ దృష్ట్యా కొన్ని ట్రావెల్స్ ధరలను ఏకంగా 3 నుంచి 4 రెట్లు పెంచేశాయి. నాన్ ఏసీ స్లీపర్ సీట్లకు కొన్ని ప్రముఖ ట్రావెల్స్ సంస్థలు ఒక వ్యక్తికి ఏకంగా రూ. 4,999 నుంచి రూ. 5,700 వరకు వసూలు చేస్తున్నాయి. ఏసీ స్లీపర్‌కు కొత్తగా అందుబాటులోకి వచ్చిన సర్వీసుల్లో కూడా టికెట్ ధర రూ. 5,300 దాటిపోయింది. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే బస్సుల ఛార్జీలు కూడా గణనీయంగా పెరిగాయి. పండుగ రద్దీని బట్టి సాధారణ ధర కంటే రూ. 1,000 నుంచి రూ. 1,500 అదనంగా వసూలు చేస్తున్నారు. పెంచిన ధరలకు సంబంధించిన స్క్రీన్ షాట్లను ప్రయాణికులు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. 'విమాన ప్రయాణం కంటే బస్సు టికెట్ ధరలే ఎక్కువగా ఉన్నాయని, ఇలాగైతే ఇంటికి వెళ్లడం కంటే నగరంలోనే ఉండిపోవడం మేలు' అని నెటిజన్లు వాపోతున్నారు. సాధారణంగా దసరా, సంక్రాంతి వంటి పెద్ద పండుగల సమయంలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి, అధిక ధరలు వసూలు చేసే ట్రావెల్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తుంటారు. కానీ.. ఇలాంటి 'లాంగ్ వీకెండ్స్' సమయంలో ప్రైవేట్ దోపిడీని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

# కోచింగ్ సెంటర్‌లో కుమారుడి అనుమానాస్పద మృతి

## - న్యాయం చేయాలంటూ మహిళ ఆత్మహత్యకు యత్నం

**మార్కాపురం:**మార్కాపురం జిల్లా కనిగిరిలో ఉద్రిక్తత నెలకొంది. సింగరాయకొండలోని నవోదయ కోచింగ్ సెంటర్‌లో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన తన కుమారుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తౌషిక్ తల్లి కనిగిరిలో మూడంతస్తుల భవనం పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నాని కి పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మహిళ ప్రమాదవశాత్తు కిందపడినా ప్రాణాపాయం కలగకుండా భవనం కింద వల ఏర్పాటు చేసి అప్రమత్తంగా చర్యలు చేపట్టారు. అనంతరం అధికారులు ఆమెను నచ్చజెప్పి, చాకచక్యంగా కిందికి దించారు. దీంతో అక్కడి ప్రజలు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా తౌషిక్ మృతిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# పిడుగుపాటుకు విద్యార్థి తండ్రి మృతి

అమరావతి: ఎపిలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. అమరావతిలో భారీ వర్షం కురిసింది. తుళ్లూరులోని మేరీ మాత హై స్కూల్‌కు సమీపంలో పిడుగుపడి ఓ విద్యార్థి తండ్రి మృతిచెందారు. కృష్ణాజిల్లాలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరులో వర్షం పడింది. విజయవాడలో ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఏలూరు జిల్లాలోని నూజివీడులో ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. ఓ ఇంటిపై పిడుగు పడింది. దీంతో ఇంటి టెర్రస్ పైన పిట్టగోడ పాక్షికంగా ధ్వంసమైంది.

పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కోనసీమ, సత్యసాయి, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద నిలబడవద్దని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ చెప్పారు.

అక్షరగళం


# పరాభవనామ ఉగాది !




కాలం ఒక ప్రవాహం! కాలం దైవ స్వరూపం. నిరంతరంగా సాగుతూనే ఉంది. ఈ ప్రకృతి ఎప్పుడు మొదలయ్యిందో తెలియదు కానీ..మానవుడు తనకు ఊహ తెలిసి, జ్ఞానం సముపార్జించాక సూర్యచంద్రుల గతులను బట్టి..కాల నిర్ణయం చేశాడిన చెబుతారు. పురాణాల ప్రకారం కాలం అనంతం. కాలానికి తగ్గట్టుగా కర్మలు నెరవేర్చడంతోనే మనిషి 'జ్ఞాన ప్రయాణం' మొదలైంది. అదే ఈ యుగానికి.. 'ఆది' అయింది. కాల మహిమను గుర్తు చేసుకుంటూ తెలుగు వారు చేసుకునే మొదటి పండుగే ఉగాది! చైత్రమాసం...వసంత రుతువు కూడా కాలానికి మార్పుగా గుర్తించాలి. ఉగాది నుంచే బ్రహ్మదేవుడు సృష్టి ఆరంభించాడని, యుగాది కాస్తా ఉగాది అయ్యిందన్న ప్రచారం కూడా ఉంది. కాలాన్ని ఆపడం, దానికి ఎదురెళ్లడం ఎవరి తరమూ కాదు. అయితే, మనిషి తన అవసరాలకు అనుకూలంగా కాలాన్ని విభజించుకున్నాడు. అలా కాలాన్ని పరిశీలించుకుంటూ దానికి తగ్గట్లు నడుచుకుంటూ తన బుద్ధికి పదును పెట్టుకున్నాడు. అలా ఉగాది పండుగను తొలి అడుగుగా గుర్తించాడు. చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయ సమయంలో బ్రహ్మ ఈ జగత్తును సంపూర్ణంగా సృష్టించాడు. అని సమాధానం చెప్పాడు. ఇది ఇలా ఉంచితే మన దేశంలో పుష్య–మాఘ మాసాలు పంటలు పండి ప్రకృతి రసభరితంగా ఉండేకాలం. ప్రజలు తమ శ్రమ ఫలితాన్ని కట్టెదుట చూస్తూ పొంగి పోతారు.ఇదే మొదట్లో మన సంవత్సరాది. దీనిని సూచించే దినం మకర సంక్రమణం.ఇది మార్గశిర– పుష్య–మాఘమాసాల మధ్యన వచ్చేది విషువత్కాలం. విషువత్కాలమంటే పగలూ రాత్రీ సరిసమానంగా ఉండే కాలం. సమరాంత్రిందివే కాలే విషువత్ అన్నాడు అమరసింహుడు. ఈ విషువత్తులు రెండు.మకర సంక్రాంత్రి అలాంటి విషువత్తు లలో ఒకటి. ఈనాటి నుంచి ప్రకృతిలో క్రొత్త క్రొత్త మార్పులు కలగడం ఆరంభం అవుతుంది.మనకొక సంవత్సరమైతే దేవతలకొక దినం. వారి దినం మేషంతో ప్రారంభమౌతోంది; మానవుడు ఋతువులు తన లెక్కలకు ముందు వెనుకలుగా రావడం చూచి, సూర్యచారాన్ని తక్కిన గ్రహాల చారాన్ని లెక్కలు కట్టసాగాడు.సూర్యుడు విషువత్తులో ప్రవేశించిన నాటినుంచి లెక్కకట్టి రాసులు విభజించాడు. ఈవిధంగా నభో మండలం– 12 భాగాలు అయినది. ఆరాసులతోనే మాస సంకేతం చేసుకున్నాడు. సూర్యుడు ఒక రాశినుంచి మరొకరాశికి ప్రవేశించడానికి దాదాపు 30, 31 దినాలవుతుంది. కాని చంద్రుని వృద్ధిక్షయాలతో ఏర్పడిన నెలకు, తర్వాత సూర్యమానపు నెలకూ క్రమంగా నెలవారా రావడం మొదలైంది. చంద్రమానానికి 19 సం.లకు ఏడు అదనపు నెలలు చేర్చి రెండు మానాలను సర్దుకోవలసి వచ్చింది.కనుకనే ప్రతి మూడోఏటా చంద్రమాన సం.లో ఒక అధిక మాసం వస్తూవుంటుంది. నిజానికి చంద్రమానమే వేదకాలం నుంచి ఆచరణలో ఉన్నదేమో!! సౌరమానం వ్యవహారంలో ఉన్న ప్రాంతాలలోనూ వైదిక కర్మలకు చంద్రమానాన్ని అనుసరించడమే దీని ప్రాచీనతకు ప్రమాణం. ఉత్తరాయణం వసంత రుతువు శుక్ల పక్షం ప్యాడ్యమి తిథి.. ఉగాది పండుగ ఈ ఏడాది మార్చి 19న వచ్చింది. అనాదిగా వస్తున్న ఈ ఉగాది.. 'యుగాది'. అన్న సంస్కృత పదం నుంచి పుట్టింది. మన వేదాలకు మంత్ర సృష్టి జరిగిన రోజు. సూర్యుడు మేషరాశిలో ప్రవేశించే రోజు. కాలం వసంతంలోకి అడుగు పెట్టిన రోజునే ఉగాది. పండుగగా, కొత్తసంవత్సరాదిగా తెలుగువాళ్లు జరుపుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో ఈ ఉగాది జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. మన సంప్రదాయంలో ఏ పండుగను చూసినా అది ప్రకృతితో ముడిపడి ఉంటుంది. అందులోనూ ఉగాది అయితే దాన్ని ఏకోణంలో చూసినా ప్రకృతి ఆధారంగానే కనిపిస్తుంది. వసంత రుతువు వచ్చిందని తెలియజేసే పండుగఉగాది. ఉగాది నాటికి చుట్టు పక్కన ఏ చెట్టును చూసినా లేత ఆకులతో పచ్చగా కనువిందు చేస్తుంటుంది. ఆ సంతోషం కోయిల పాటల్లో, నెమలి నాట్యాల్లో కనిపిస్తుంది. ఉగాది పండుగ వెనక ఉన్న కథనాన్ని ఒక్కొక్కరూ ఒక్కో విధంగా చెప్తారు. ఉగాది.. 'ఉగ' అంటే నక్షత్ర గమనం. జన్మ ఆయుష్షు అని అర్థాలు ఉన్నాయి. వీటికి అది ఉగాది అంటే ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి జీవి ఆయుష్షుడు మొదటిరోజునే ఉగాదిగా మారిందంటారు. చైత్ర శుద్ధ పాడ్యమి నాడే కలియుగం మొదలైందని.. త్రేతాయుగంలో ఉగాది రోజే శ్రీరాముడికి పట్టాభిషేకం జరిగిందని మరో కథనం.. ఈ రోజే శ్రీమహావిష్ణువు మత్స్యావతారంలో సోమకాసురుని సంహరించి వేదాలను బ్రహ్మకు అప్పగించాడని, బ్రహ్మదేవుడు సృష్టిని మొదలు పెట్టిన రోజే ఉగాదని అంటారు. మొదటి తెలుగు చక్రవర్తి శాలివాహనుడు. ఉగాది రోజునే సింహాసనాన్ని అధిష్టించాడనేది కూడా ప్రచారంలో ఉంది. ఉగాది రోజు నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది. కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగగా పేరుగాంచింది. అయితే, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్టాల్లో కూడా ఉగాదిని గొప్పగా జరుపు కుంటారు.. కర్నాటకలో ఉగాదిమహారాష్ట్రలో గుడిపాడ్వా, తమిళనాడులో 'పుత్తాండు అనే పేరుతో, కేరళలో 'విషు', పంజాబ్‌లో 'వైశాఖీ', బెంగాల్లో పొయ్లా బైశాఖ్ ' అనే పేర్లతో ఉగాది జరుపుకుంటారు. రెండు మూడు రోజుల ముందు నుంచే పండగ పనులు మొదలవుతాయి. ఉగాది రోజు పొద్దున్నే ఇంటిని శుభ్రం చేసుకుంటారు. తైల అభ్యంగన స్నానం చేసి గుమ్మానికి మామిడి తోరణాలు, వేపాకు తోరణాలు కడతారు.

కొత్త బట్టలు వేసుకొని కొత్త కుండ కొనడంతో సందడి మొదలవుతుంది. ఒకవైపు పచ్చడి తయారు చేస్తుంటే..మరోవైపు వేడివేడిగా భక్ష్యాలు తయారవు తుంటాయి. ఉగాది పచ్చడి...వంటలు ఇష్టమైన దేవునికి నైవేద్యంగా పెట్టి కొత్త సంవత్సరం అంతా శుభం కలగాలని కోరకుంటారు. తర్వాత ఇంటిల్ల పాది పరగడపున ఉగాది పచ్చడి తిని, తర్వాత.. భక్ష్యాలు తింటారు. కొత్త పనులు, కొత్త వ్యాపారాలు కూడా ఉగాది నాడు మొదలు పెడుతుంటారు కొందరు. ఉగాది రోజు పంచాంగ శ్రవణం చేస్తారు. ఈ పంచాంగ శ్రవణం వినడం పట్ల ఈ సంవత్సరంలో జరగబోయే మంచి చెడులతో పాటు పరిణామాలు తెలుసుకుంటారు. కలియుగంలో నక్షత్ర ఫలితాలతో పాటు రాశిఫలాలు.. ఆదాయ వ్యయాలు, రాజపూజ్య అవమానాలు తెలుసుకుంటారు. ఇది జాగ్రత్తగా నడుచుకోవడానికి ఉపయోగపడుతుంది.

# ఉగాది పచ్చడి వైశిష్ట్యం

## - కాలంలో మార్పులను తట్టుకునే ఔషధం



**శ్రీశైలం:**తెలుగువారి కొత్త సంవత్సరం ప్రారంభం కానుంది. తెలుగు పంచాంగం ప్రకారం చైత్రమాసం శుద్ధ పాడ్యమి రోజున ఉగాది పండుగతో కొత్త సంవత్సరం ఆరంభం కానుంది. ఈ ఏడాది ఉగాది పండుగ మార్చి 19న వచ్చింది. ఉగాది పండుగ రోజు అందరూ కచ్చితంగా ఉగాది పచ్చడి తినాలని పండితులు చెబుతుంటారు. అసలు ఆ రోజు ఉగాది పచ్చడి ఎందుకు తినాలి. ఎన్ని రోజులు వసంత గమన శుభవేళ.. పచ్చగా కళకళలాడే ప్రకృతి పరంగా.. రేవతి నక్షత్ర ప్రవేశంతో.. చైత్ర శుద్ధ పాడ్యమి గురువారం రోజున ఉగాది పండుగ .. శ్రీ పరాభవ నామ సంవత్సర కాలగమనం ఆరంభమవుతుంది. ఉగాది పచ్చడిని ఒక్కో చోట ఒక్కో విధంగా తయారు చేస్తుంటారు. అందులో తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచులను తప్పకుండా ఉండేలా చూస్తారు. ఈ పచ్చడి కోసం చెరకు, అరటి పళ్ళు, మామిడి కాయలు, వేప పువ్వు చింతపండు, జామకాయలు, బెల్లం, జీలకర్ర, మిరపకాయ వంటివి వాడుతుంటారు. ఇన్ని కలిపి చేసిన ఉగాది పచ్చడిని ఒక మహాఔషధమని అంటారు పెద్దలు. ఈ ఉగాది పచ్చడిని ఈ పండుగ నుంచి శ్రీరామనవమి వరకూ లేదాచైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ ఉంటే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని. ఆ సంవత్సరమంతా రోగాలేవీ దరిచేరవనే నమ్మకం కూడా ఉంది. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం ఉగాది పచ్చడిని నింబకుసుమ భక్షణం...అశోకకళికా ప్రాశనం అంటారు. రుతువులలో వచ్చే మార్పుల వల్ల వచ్చే రోగాల నుంచి రక్షణగా, ఈ పచ్చడిని ఔషధంగా తీసుకోవడం పూర్వం నుంచే అనవాయితీగా వస్తోంది. పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ అమ్మోరు వంటి అంటురోగాలను దగ్గరకి రానివ్వకుండా కాపాడుతుంది మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉంది. మిరియాలు దగ్గు జలుబు, పైత్యాలను అదుపులో ఉంచుతాయి. బెల్లం రక్తాన్ని శుద్ధి చేస్తుంది. చింతపండు మలబద్ధకాన్ని, నీరసాన్ని తగ్గిస్తుంది. ఉప్పు ఎండాకాలంలో వచ్చే హైడ్రేషన్ని తగ్గిస్తుంది. సంవత్సరం అంతా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సమానంగా తీసుకోవాలనే సందేశాన్ని కూడా ఉగాది పచ్చడి ఇస్తుంది. బెల్లం– తీపి అనేది సంతోషానికి, ఉప్పు– జీవితంలో ఉత్సాహానికి... వేప పువ్వు– చేదు బాధ తాలూకు అనుభవాలకు, చింతపండు– పులుపు నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులకు, పచ్చి మామిడి ముక్కల పులుపు– కొత్త సవాళ్లకు.. కారం సహనం కోల్పోయేట్టు చేసే పరిస్థితులకు సంకేతం అని చెప్తారు.ఉగాది పచ్చడి ఒక మహాఔషధమని పెద్దలు చెబుతుంటారు. ఈ ఉగాది పచ్చడిని శ్రీరామ నవమి వరకూ లేదా చైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ తీసుకోవాలి. అలా 9 లేదా15 రోజుల పాటు ఈ ఉగాది పచ్చడి తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందంటారు. ఉగాది పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ, అమ్మోరు మొదలైన వ్యాధులను దగ్గరకు రానీయదు. మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉన్నది. ఇది కఫము, వాతము, పైత్యాలనే మూడు దోషాలను అదుపులో ఉంచుతుంది. మనకు వచ్చే జబ్బుల్లో చాలా వరకూ వీటివల్లే వస్తాయి.. 'శతాయుర్వజ్ర దేవయ సర్వ సంపత్రాయచ.. సర్వతిష్ట వినాశయ నిబంకదళ బక్షణమ్' అనే శ్లోకం పఠించి ఉగాది ప్రసాదాన్ని స్వీకరించాలి. పంచాంగ శ్రవణం వినాలి. మంచి ఆశయాలతో ముందడుగు వేయాలి. ఆ రోజున (మార్చి 19) పంచాంగాన్ని విన్న పక్షంలో ఏ గ్రహం మనకి అనుకూలంగా లేదో, ఎవరు మనకి సహాయకులో తెలిసి, ఏయే కష్ట నష్టాలో తెలుసుకొని వాటికి సంబంధించిన ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకోగలుగుతామని పండితులు చెబుతున్నారు.

# ఉగాది రోజు

## ఆలయదర్శనం శుభం



**వేములవాడ,:**తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మార్చి 19వ తేదీ గురువారం ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారంతా భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈ రోజు ఏం చేస్తే.. ఏడాదంతా అదే జరుగుతుందనే ఒక భావన తెలుగు ప్రజలలో బలంగా ఉంది. గతేడాది కొంత కష్టంగా ఉంది. ఈ ఏడాది అయినా బాగుంటుందా అని చాలా మంది అనుకుంటూ ఉంటారు. అలాంటి వారు ఉగాది పర్వదినం వేళ.. ఇలా చేయడం వల్ల ఏడాదంతా శుభ ఫలితాలు పొందవచ్చని పండితులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల కష్టాలు తొలగి.. ఆనందంగా ఉండొచ్చని అంటున్నారు. కొత్త ఏడాది ఎలా ఉండబోతోంది.. గ్రహాల ప్రభావం ఏ రాశుల మీద ఎలా ఉందనేది పండితుల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ పండగ రోజు.. దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకుంటే కుటుంబానికి శుభం కలుగుతుందని పండితులు చెబుతారు.ఆ రోజు పెద్దల ఆశీర్వాదం తీసుకోవాలి. అలా తీసుకోవడం వల్ల ఆయురారోగ్యాలు, విజయాలు కలుగుతాయి. ఉగాది వేళ.. మీకు తోచిన వాటిని దానం చేస్తే ఎంతో పుణ్యం కలుగుతుంది. అన్నదానం, వస్త్రదానం ఇలా ఏదైనా చేయవచ్చు. ఉగాది రోజు కొత్త పనులు ప్రారంభిస్తే మంచి ఫలితాలు సంప్రాప్తిస్తాయి. చేపట్టిన పనుల్లో అడ్డంకులు ఉండవు. కొత్త ఏడాది మంచి ఆలోచనలతో ప్రారంభించాలి. ఉగాది నుంచి ఈ ఏడాది అంతా బాగా కలిసి రావాలని మనస్సులో సంకల్పం చెప్పుకొని.. కొత్త పనులు ప్రారంభించాలి. ఉగాది రోజు గణపతి ఆలయానికి వెళ్లి గరికను సమర్పిస్తే శుభం కలుగుతుంది. ఎర్రటి పుష్పాలను సమర్పిస్తే.. శుభ ఫలితాలు కలుగుతాయి. వినాయకుడు విఘ్నాలను తొలగిస్తాడు. ఈ రోజు ఓం గం గణపతయే నమ: అంటూ సాధ్యమైనన్ని సార్లు ఈ మంత్రాన్ని స్మరణ చేసుకోవాలి. ఉగాది రోజు ఇలా చేయడం వల్ల ఏడాదంతా ఐశ్వర్యం, ఆనందం, శుభాలు కలుగుతాయి.

# కొత్త జీవితం ప్రారంభానికి సూచిక

## - సంప్రదాయబద్ధంగా పండగ జరుపుకోవడం ఆనవాయితీ

**యాదగిరిగుట్ట,:**ఉగాది పండుగ తెలుగు వారి జీవితాల్లో కొత్త ఆశలను నింపే పండగు. సంస్కృతి.. సంప్రదాయాలకు.. ధర్మబద్ధ జీవన విధానాన్ని ప్రారంభించిన రోజు. ఇలాంటి ముఖ్యమైన రోజున మన జీవితాలను ఆధ్యాత్మిక పరంగా.. సేవా పరంగా ఎన్నో కార్యక్రమాలు చేయాలని పండితులు చెబుతున్నారు. చైత్ర శుద్ధ పాడ్యమి తిథి ఉదయం 6.53 గంగలకు ప్రారంభమవుతుంది. పాడ్యమి తిథి మార్చి 20 ఉదయం 04:54 గంటలకు ముగుస్తుంది. కావున పండితులు తెలిసిన వివరాల ప్రకారం ఉదయం సమయంలో పాడ్యమి తిథి ప్రాబల్యం ఉండటం వల్ల మార్చి 19నే ఉగాది పర్వదినంగా భావిస్తారు.ఉగాది రోజున ప్రాత: కాలంలో కాలకృత్యాలు తీర్చుకొని ఇంటిని శుభ్రం చేసుకోవాలి. తరువాత ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి.. గడపలను పసుపు.. కుంకుమతో అలంకరించాలి. పూజా మందిరంలో కలశాన్ని ఏర్పాటు చేసుకోవాలి. కుటుంబంలో కలశాన్ని ఏర్పాటు చేసుకొనే ఆచారం లేకపోతే అవసరం లేదు. కుల దైవాన్ని ఆవాహన చేసుకోవాలి. ముందుగా కొత్త సంవత్సరానికి సంబంధించిన సంకల్పాన్ని చెప్పుకొని.. గణపతి పూజ చేసుకొని.. విష్ణుమూర్తిని.. లక్ష్మీదేవిని.. పరమేశ్వరునికి పూజలు చేయాలి. షోడసోపచార పూజలు చేసి.. ధూపం.. దీపం.. హారతి తరువాత ఉగాది పచ్చడిని స్వామివారికి నివేదించి ప్రసాదంగా తీసుకోవాలి. ఉగాది పచ్చడిని నైవేద్యంగా సమర్పించడం ద్వారా జీవన తత్వాన్ని గుర్తుచేసుకుంటూరు.తరువాత మహానివేద్యం సమర్పించాలి. ఈ విధంగా చేయడం ఎంతో కాలంగా వస్తున్న ఆచారం.. ఇంట్లో పూజ అనంతరం... దగ్గరలోని దేవాలయానికి వెళ్లాలి. ఉగాది రోజున పంచాంగ శ్రవణం వినాలి. ఇది ఒక ప్రాచీన ఆచారమని పండితులు చెబుతున్నారు. పంచాంగం అనేది తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం వంటి 5 ముఖ్య అంశాలను వివరిస్తుంది. కొత్త సంవత్సరంలో జరిగే ఖగోళ మార్పులు .. వాటి ప్రభావాలను తెలియజేస్తాయి. పంచాంగ శ్రవణం ద్వారా ఆ సంవత్సరంలో వర్షపాతం, వ్యవసాయం, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ స్థితిగతులు, సామాజిక శాంతి వంటి అంశాలపై సంక్షిప్త అవగాహన లభిస్తుంది. తరువాత బ్రాహ్మణులకు వస్త్రదానం .. దక్షిణ తాంబూలం ఇచ్చి.. వారి ఆశీర్వాదాలను తీసుకోవాలి. తెలుగు పంచాంగం ప్రకారం మొత్తం 60 సంవత్సరాలు ఉంటాయి. ఇవే పునరావృతమవుతుంటాయి. ఈ ఏడాది 2026 లో మార్చి 19న కొత్త తెలుగు సంవత్సరం పరాభవనామ సంవత్సరం ప్రారంభమవతుంది. పరాభవం అంటే లోపాలను అధిగమించి ఉన్నత స్థితిని చేరుకొనే సమయాన్ని సూచిస్తుందని పండితులు చెబుతున్నారు. కొత్త సంవత్సరంలో ఆధ్యాత్మికత.. వినయం.. ఆత్మపరిశీలన.. సేవాగుణాన్ని వృద్ధి చేసే సందేశాన్ని ఇస్తుంది.

## ఆత్మపరిశీలనతో అడుగు వేయాలి : పరాభవంలో అప్రమత్తంగా ఉండాలి

**విజయవాడ,:**తెలుగువారి నూతన సంవత్సరం పరాభవనామ సంవత్సరం. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం పరాభవం అంటే గర్వం.. అహంకారం.. స్వార్థం అని అర్థం. పండితులు తెలిపిన వివరాల ప్రకారం.. పరాభవం అంటే ఏమిటి.. కొత్త సంవత్సరం విశేషాలు.. రహస్యాలు ఏమిటి.. తెలుగు పంచాంగం ప్రకారం.. కొత్త సంవత్సరం.. పరాభవ నామ సంవత్సరం మార్చి 19న ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరం గురించి .. ఆధ్యాత్మికంగా పరిశీలించినట్లైతే.. ఇలాంటి వ్యతిరేక లక్షణాలను లక్షణాలను జయించి వినయం వైపు నడిపించే కాలాన్ని సూచిస్తుంది. ప్రతి వ్యక్తి తన లోపాలను గుర్తించి..వాటిని అధిగమించడానికి ప్రయత్నించే సంవత్స రమని పండితులు వివరిస్తున్నారు. పరాభవం అంటే ఏమిటి..పురాణాల ప్రకారం తెలుగు కాలచక్రంలో 60 సంవత్సరాలు ఉంటాయి. ఈ చక్రంలో పరాభవ అనేది 40వ సంవత్సరం. సంస్కృతంలో ..పరాభవ.. అంటే ఓటమి.. అపజయం .. అవమానం అనే అర్థాలు ఉన్నాయి. కాని జ్యోతిష్యనిపుణులు , ఆధ్యాత్మిక పండితుల విశ్లేషణ ప్రకారం .. పరాభవ నామ సంవత్సరానికి లోతైన తాత్పర్యం ఉందని చెబుతున్నారు. కొత్త సంవత్సరం పేరులో ప్రతికూలత ఉన్నా కాని.. మనిషి జీవితంలో మార్పు, ఆత్మపరిశీలన, ఆత్మవికాసాన్ని సూచించేందుకు ఒక సంకేతమని చెబుతున్నారు.

అహంకారంపై విజయం : కొత్త సవంత్సరం.. పరాభవ నామ సంవత్సరం పేరు ఆధారంగా స్వార్థం.. అహంకారం.. గర్వం.. మొదలగు చెడు లక్షణాలను వదలి.. మంచిగా.. అందరి మన్నలు పొందేలా ఈ తెలుగు సంవత్సరం ( పరాభవ) సూచిస్తుందని పండితులు చెబుతున్నారు.ప్రతి వ్యక్తి తనలోని లోపాలను గుర్తించి.. వాటిని అధికమించేందుకు ఈ ఏడాది ప్రయత్నించే దశ అని పండితులు చెబుతున్నారు. తెలుగు సంవత్సరం పరాభవ నామ సంవత్సరం.. ప్రతి మనిషి తన గత అనుభవాలు... తప్పులు... విజయాల గురించి ఆలోచించి... వాటి నుంచి పాఠాలు నేర్చుకునే సమయంగా భావిస్తారు. ఇది వ్యక్తిత్వ వికాసానికి దారితీసే ఒక ఆత్మపరిశీలనా దశను సూచిస్తుంది. ప్రతి వ్యక్తికి కూడా కొంతమంది శత్రువులు ఉంటారు. పలు ఆధ్యాత్మిక గ్రంథాల్లో చెప్పిన విధంగా అరిషడ్వర్గాలు.. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు.. మనిషి ఎదుగుదలను అడ్డుకోవడం.. శత్రువులను పెంచే అంతర్గత శత్రువులు ఉంటారు. పరాభవ నామ సంవత్సరంలో ఇలాంటి ఎనిమీస్?పై విజయం సాధించి.. ధర్మబద్ధంగా జీవితం గడిపేందుకు ఒక సూచన అని పండితులు చెబుతున్నారు. తెలుగు పంచాంగ చక్రం ప్రతి 60 సంవత్సరాలకు ఒకసారి పునరావృతమవుతుంది. తెలుగు కాలచక్రంలోని 60 సంవత్సరాలను పండితులు మూడు భాగాలుగా విభజిస్తారు. ఈ 60 సంవత్సరాలను బ్రహ్మ, విష్ణు, శివ విభాగాలుగా చెప్పబడతాయి. ఈ విభాగాలలో పరాభవ సంవత్సరం విష్ణువుకు కేటాయించిన రెండవ విభాగంలో చివరి సంవత్సరమని పండితులు చెబుతున్నారు. కొత్త సంవత్సరం పేరు వినడానికి ప్రతికూలంగా అనిపించిన ప్పటికీ.. పరాభవ అనే పదాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే.. ఓటమి కాదు.. అది మన లోపాలను గుర్తించి.. అలాంటి వాటిని జయించే మార్గాన్ని సూచిస్తుందని అంటున్నారు జ్యోతిష్య పండితులు . ప్రతి మనిషిలో కూడా ఎంతో కొంత అహంకారం ఉంటుంది. దానిని తగ్గించి... ఆత్మపరిశీలన చేసుకొని.... సత్యంగా..ధర్మంగా ఉండి ముందుకు సాగాలని సూచించే ఒక ఆధ్యాత్మిక సందేశాన్ని ఈ సంవత్సరం ప్రతిబింబిస్తుందని పండితులు చెబుతున్నారు.

# పండగల పరమార్థం

## సేవ జాగ్రత్తలు తీసుకుంటూ నడవాలి

తిరుపతి:శ్రీ పరాభవ నామ సంవత్సరంలో వ్యక్తిగతంగానూ.. సామాజికంగానూ .. ఆలోచలను సక్రమంగా ఉంచే కాలమని పండితులు చెబుతున్నారు. మార్చి19న ప్రారంభమయ్యే పరాభవనామ సంవత్సరంలో ప్రతి విషయంలో స్పష్టత ఉండే అవకాశంఉంది. ఇంకా విద్యారంగంలో పెనుమార్పులకు అవకాశం.. సమాజ సేవ.. ఐకమత్యత మొదలగు విషయాల్లో గణనీయమైన ప్రభావం ఉంటుంది. ఆర్థిక పరంగా మెరుగైన ఫలితాల కోసం దీర్ఘకాలిక అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పండితులు అంటున్నారు. ఏ పండుగ అయినా.. వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు సమాజ శ్రేయస్సు కూడా ముఖ్యం. ప్రతి రోజు సమాజ సేవ చేయడానికి ఎవరికి అవకాశం ఉండదు. అందువలన కొత్త సంవత్సరం రోజు శ్రీ పరాభవ నామ సంవత్సరంలో సేవా సంకల్పంతో ముందడుగు వేసి.. విద్య, వైద్యం, పునరావాస సేవలకు మన వంతు సహకారం అందించి. .వికలాంగులకు..అనాథ పిల్లలకు.. పేదవారికి చేయూత నిచ్చి . వెలుగు అనే ఆశను నింపుదాం. . .. అసలైన పుణ్యకార్యంలో భాగస్వాములయి.. . సమాజానికి మనవంతు సేవ చేద్దాం. ఈ ఏడాది దేశ భవిష్యత్? ఎలా ఉంటుంది.. ఏ పండితుని పంచాంగ శ్రవణం వినాలి.. అనే విషయాల గురించి చర్చించుకుంటున్నారు.. కొత్త సంవత్సరం పరాభవనామ సంవత్సరం.. ప్రపంచానికి సవాళ్ల సంకేతమా.. అవమానాలు.. అపజయాలు ఎలా ఉంటాయి.. అన్న సంశయాలు ఉన్నాయి. జ్యోతిషశాస్త్రం ప్రకారం తెలుగు కొత్త సంవత్సరం శ్రీపరాభవ నామ సంవత్సరంలో రాజకీయంగా సంచలనాలు.. పెనుమార్పులు జరిగే అవకాశం ఉందిం. పలు దేశాల్లో రాజకీయ సంక్షోభానికి దారితీసే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. ఇక ఆర్థిక విషయాలను పరిశీలిస్తే అనేక విధాలుగా ఒడిదుడుకులు ఉండే అవకాశం ఉందని జ్యోతిష్య నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే రష్యా.. ఉక్రెయిన్? యుద్ధం నాలుగేళ్లుగా కొనసాగుతుంది. ఇప్పుడు ఓ పక్క అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు.. ఇరాన్ తో తలపడుతుంది. అటు కొన్ని దేశాలు.. ఇటు కొన్ని దేశాలు ఇప్పటికే తమ మద్దతును ప్రకటించాయి. హార్మోజ్ జలసంధి నుంచి అమెరికా యుద్ధ నౌకలు వెళ్లేందుకు చైనా అభ్యంతరం తెలిపింది. ఇదే బాటలో మరికొన్ని దేశాలు కూడా ఉన్నాయి. అమెరికా ఏమాత్రం వెనక్కుతగ్గడం లేదు. అక్కడ పరిస్థితి అలా ఉంటే పాకిస్థాన్?.. ఆఫ్ఘనిస్తాన్ కూడా ఒకరిపై మరొకరు బాంబులు విసురుకుంటున్నారు. ఈ పరిణామాలు పరాభవనామ సంవత్సరంలో ఇంకా పెచ్చే మీరే అవకాశాలతో పాటు .. ప్రపంచంలో ఆర్థిక పరిస్థితిలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ఆటంకాలు, అవరోధాలు, సవాళ్లు, సమస్యలు, అవమానాలను సూచిస్తోంది. కొన్ని దేశాలకు అపజయాలు తప్పవంటున్నారు పండితులు.అంచనా వేస్తున్నారు. . వీటి ప్రభావం పాలకుల మీద, ప్రజల మీద తీవ్రస్థాయిలో ఉండబోతోందని చెబుతున్నారు జ్యోతిష్య పండితులు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగే అవకాశం ఉందని... ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. పరాభవ నామ సంవత్సరమనే పేరు ముఖ్య ఉద్దేశం అహంకారాన్ని వదిలిపెట్టి జ్ఞానంతో, వినయంతో లోపాలను సరిదిద్దుకుని అధిగమించడం, పురోగతి చెందడమే అయినా.. ప్రజలు.. పాలకులు..తీసుకొనే నిర్ణయాలతో ప్రతికూల పరిణామాలు జరిగే అవకాశం ఉంది. ఏది ఏమైనా కొత్త సంవత్సరంలో ఎవరికి వారు జాగ్రత్తగా ఉంటే విజయాలు, సాఫల్యాలను సాధించే అవకాశం కూడా ఉందని కూడా పండితులు చెబుతున్నారు.

# మట్టి పాత్రలను వాడండి

- ఆరోగ్యాన్ని కాపాడుకోండి .ఉగాది పండుగను మట్టి పాత్రలతో జరుపుకుని కుల వృత్తిని ప్రోత్సహించండి
- తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**హైదరాబాద్** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని పురస్కరించుకొని “మట్టి పాత్రలు వాడండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి ,కుల వృత్తులను ప్రోత్సహించండి” నినాదంతో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కి ఉగాది మట్టి పాత్రల కిట్ ను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడడానికి ,కుల వృత్తులను కాపాడడానికి ఆరోగ్యాలను కాపాడుకోవడానికి మట్టి పాత్రలు మంచివని తెలిపారు. అందజేశారు. మట్టి పాత్రలు వాడకం తరతరాల సంప్రదాయమని , దీని వల్ల ఎలాంటి వ్యాధులు రాకుండా ఉంటాయని, ఉగాది పండుగ సందర్భంగా మట్టి పాత్రలు వాడండి కుల వృత్తులను కాపాడండి .. ఆరోగ్యాన్ని రక్షించుకోండి అని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.

## మార్చి 24న పేద ప్రజల ఇళ్ల స్థలాల కై
# ధర్నాలు జయప్రదం చేయండి

- రాష్ట్ర సమితి ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరణ
- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు పిలుపు



**నరసరావుపేట** నరసరావుపేట పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో మార్చి 24వ తేదీన పేద ప్రజల ఇళ్ల స్థలాలపై ధర్నాలు చేయాలనీ పిలుపునిస్తూ, రాష్ట్ర సమితి ముద్రించిన వాల్ పోస్టర్లను సిపిఐ పార్టీ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం సిపిఐ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, మార్చి 24వ తేదీన స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద పేద ప్రజలకి ఇళ్ల స్థలాలు కేటాయించాలని గ్రామీణ ప్రాంతాల 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల 2 సెంట్లు ఎన్డీఏ ప్రభుత్వం వాగ్దానం చేశారు అని అన్నారు. గతంలో సిపిఐ ఆధ్వర్యంలో సచివాలయాల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా అనేక అర్జీలు సమర్పించి ఉన్నాము అని రాంబాబు అన్నారు. తక్షణమే అర్జీని పరిశీలించి ఇళ్ల స్థలాలు పట్టాలు మంజూరు చేయాలని, అదేవిధంగా టిట్టుకో ఇళ్ళని లబ్ధిదారులకి అందించాలని, అద్దె కొంటున్న అద్దెదారులకి రెంట్ పే చేయాలని సిపిఐ గా డిమాండ్ చేస్తూ 24వ తేదీన సిపిఐ కార్యాలయం నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహిస్తామని జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంబాబు తో పాటు సిపిఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణ రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై వెంకట్, పట్టణ కార్యదర్శి చిన్న జాను సైదా, సిపిఐ నాయకులు కోయా శ్రీనివాసరావు, జమ్మలమూడి, చిట్యాల శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దఈటిపాకం గ్రామం వద్ద
# గుర్తు తెలియని యువకుడు మృతి



సత్యవేడు మండలం పెద్దఈటిపాకం గ్రామానికి సమీపంలో ద్విచక్ర వాహనంతో పాటు యువకుడు ఒకరు మృతి చెందారు.బుధవారం కొందరు గ్రామస్తులు దీన్ని గుర్తించారు. మృతి చెందిన యువకుడు వయసు దాదాపు 30 నుంచి 35 సంవత్సరాల లోపు ఉంటుందని చెప్తున్నారు. పెద్దఈటిపాకం వద్ద ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే ఉన్న చింత చెట్టుకు ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో వాహనంతో పాటు యువకుడు అక్కడే ఉన్న గుంతలో కింద పడి మృతి చెందినట్లు తెలుస్తోంది.రెండు రోజుల క్రితమే ఈ ప్రమాద సంఘటన జరిగినట్టు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

## పంట ఎండిపోతుందని
# ఉరివేసుకొని రైతు ఆత్మహత్య

**సిద్దిపేట** దుబ్బాక మండలం రాగోత్తంపల్లి గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. పంట ఎండిపోతుందని మనస్తాపం చెందిన ఓ రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలో చిన్నారెడ్డి మోహన్ రెడ్డి రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. అయితే నీరు లేక వరి పంట ఎండిపోయిందని, అప్పుల బాధ భరించలేక చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకున్నాడు. పొలంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని కనిపించడం కన్నీళ్లు పెట్టిస్తోంది.

## యూపీఐ ద్వారా
# రూ.14 లక్షల 77 వేల లంచం

- ఏసీబీ వలలో సూపరింటెండెంట్

**కరీంనగర్** పెద్ద మొత్తంలో లంచాలు తీసుకుంటున్న కరీంనగర్ జాయింట్ డైరెక్టర్ వర్క్స్ అకౌంట్స్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఈగల మధుసూధన్ ఏసీబీకి దొరికిపోయాడు. సంవత్సర కాలంలో రూ.14,77,003 లంచాలుగా యూపిఐ ద్వారా తీసుకున్నట్లు ఏసీబీ గుర్తించారు. భద్రాద్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్లోని ఒక బినామీ ఖాతాను ఉపయోగించి ఈ లంచాలు తీసుకున్నట్లు నిర్ధారించారు.

## కూటమి ప్రభుత్వం మీ సంక్షేమానికి
# మరింత అండగా నిలుస్తుంది”


- దివ్యాంగుల సంక్షేమానికి “దివ్యాంగ శక్తి” పథకం - దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



**దెందులూరు** పెదవేగి మండలం దుగ్గిరాల్లోని క్యాంపు కార్యాలయం వద్ద దివ్యాంగశక్తి పథకాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించారు.. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అందిస్తూ ఏర్పాటు చేసిన తొలి బస్సు కు జెండా ఊపి ప్రారంభించారు. శనివారం నుంచి దివ్యాంగుల కొరకు దెందులూరు లో ప్రత్యేక నియోజకవర్గస్థాయి సదరం శిబిరం నిర్వహించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సుపరిపాలన అందిస్తుందని, వాటిలో భాగంగానే దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ ఈరోజు దివ్యాంగ శక్తి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి చేతులమీదుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించడం జరిగిందని దీనిద్వారా దివ్యాంగుల సంక్షేమానికి , వారిలో ఆత్మ స్థైర్యాన్ని మరింత పెంపొందించడానికి కూటమి ప్రభుత్వం ఎంతగానో దోహద పడిందని దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ గారు తెలిపారు..పెదవేగి మండలం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఉదయం దివ్యాంగ శక్తి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ గారు దివ్యాంగుల కోసం ఉచిత ప్రయాణాన్ని ఏర్పాటు చేస్తూ కేటాయించిన తొలి బస్సు కు జెండా ఊపి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న దివ్యాంగులతో మాట్లాడుతూ వారితో మమేకమైన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వ్యక్తికి ఏదైనా లోపం ఉన్నప్పుడు అందుకు రెట్టింపు నైపుణ్యాన్ని భగవంతుడు ప్రసాదిస్తాడని, తమలో దాగివున్న అటువంటి నైపుణ్యాన్ని గుర్తించి దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగుల సామాజిక ఆర్థిక సమగ్ర అభివృద్ధి సంక్షేమలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు తెలియజేశారు. ఈనాడు రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ప్రారంభించిన దివ్యాంగ శక్తి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది దివ్యాంగులు ప్రత్యక్షంగా లబ్ధి పొందనున్నారని, వారితోపాటు వారి సహాయకులకు సైతం పరసి మొత్తం రాష్ట్రంలో 12.76 లక్షల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర ఉందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా రూ.207 కోట్ల రూపాయలతో భారీ సబ్సిడీని అందించడం జరుగుతుందని, ప్రభుత్వ ఏపీఎస్ఆర్టీసీకి చెందిన సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సుల్లో ఈరోజు నుంచి దివ్యాంగులకు ఉచిత ప్రయాణం అమలు చేయడం జరుగుతుందని, బస్సు ఎక్కిన తరువాత తమ గుర్తింపు కార్డును చూపి జీరో టికెట్ను పొందవచ్చని తెలిపారు.

# రైతు అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

## అన్నదాత సుఖీభవ ఇంటింటా ప్రచారంలో టీడీపీ నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి



**కౌతాళం** రైతు అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని రైతుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ ప్రతి రైతుకు సంక్షేమ పథకాలు ప్రయోజనం చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి చేస్తుందని మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ నాయకులు రాఘవేంద్ర రెడ్డి సింగిల్ విండో చైర్మన్ వెంకటపతిరాజు,బోయ మారెప్ప టిబిపి చైర్మన్ టిప్పుసుల్తాన్,అడివప్ప గౌడ్,పట్టాభి,మరియు మండల అధ్యక్షులు సురేష్ నాయుడు, సతీష్ నాయుడు,రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం నందు పీఎం సీఎం కిసాన్ విడత అన్నదాత సుఖీభవ పథకం ఇంటింటా ప్రచారంలో భాగంగా టీడీపీ నాయకులు పాల్గొని లబ్ధి దారులకు సంక్షేమ అభివృద్ధి ఫలాల, పెట్టుబడి సహాయం కింద ఏడాదికి 20 వేలు కేంద్రం నుండి 6 వేలు,రాష్ట్ర ప్రభుత్వం నుండి 14 వేలు మూడు విడతలో రైతన్నలకు అందించిందని
వివరిస్తూ,సమస్యలను పరిష్కరించే విధంగా పాలన అందిస్తామని,ప్రతి హామీని ప్రజలకు చేరవేస్తూ,ప్రజలను చైతన్యం చేసే దిశగా అడుగులు వేస్తుందని,ప్రకృతి వ్యవసాయ సేద్యం వైపు ప్రతి రైతు కొనసాగి భూసార పరిరక్షణకు కాపాడి,అధిక దిగుబడి వచ్చే విధంగా లాభసాటి వ్యవసాయం చెయ్యాలని ప్రజలను కోరుతూ,అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం నదుల అనుసంధానం ద్వారా ప్రతి రైతు కు ఎకరాకు తాగు సాగు నీరు అందించే విధంగా మన ముఖ్యమంత్రి ప్రణాళికలు సిద్ధం చేశారని దీనికి ప్రజల సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమములో సౌద్రిబసవరాజు,రామలింగ,కురువ వీరేష్, గుండప్ప,జనసేన రామాంజినేయులు, బిజెపి చిన్న,రమేష్,పట్టణ అధ్యక్షులు డా”రాజానందు,ముకన్న, గిరి,నరసన్న, ఈరణ్ణ,సన్నప్ప,మహాదేవ,లక్కే గోవిందు,మాధవరెడ్డి, బసవరాజు,పాల్గొన్నారు.

## ‘దివ్యాంగ శక్తి’ ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల** దివ్యాంగులు సమాజంలో ఆత్మగౌరవంతో, సమాన అవకాశాలతో జీవించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఇంద్రధనుస్సు’ కార్యక్రమంలో భాగంగా ‘దివ్యాంగ శక్తి’ (ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం) పథకాన్ని స్థానిక నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి ఫరూక్ దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ రాష్ట్రవ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు 100% ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా వారిపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, వారు స్వేచ్ఛగా తిరిగేలా ప్రభుత్వం భరోసా ఇస్తోందని తెలిపారు . ఈ పథకం ద్వారా దివ్యాంగులు విద్య, ఉపాధి, మరియు ఆరోగ్య అవసరాల కోసం ఎక్కడికైనా సులభంగా వెళ్లవచ్చు అని . ఇది వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అన్నారు . ఏ ఒక్క పౌరుడు వివక్షకు గురికాకూడదనే లక్ష్యంతో, అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్న ముఖ్యమంత్రి గారి సంకల్పానికి ఈ కార్యక్రమమే నిదర్శనం అన్నారు. అనంతరం మంత్రి ఫరూక్ లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి, పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. 10వ తరగతి పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ అంతరాయం లేని మార్గాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , రజియా సుల్తానా, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్, నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రమణయ్య స్థానిక క్లస్టర్ మరియు యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, ఏపీఎస్ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో దివ్యాంగ లబ్ధిదారులు పాల్గొన్నారు.


## మంగళం డిపోలో ‘దివ్యాంగ శక్తి’
# పథకం ప్రారంభం

- ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ట్రాఫిక్ ఇన్స్పెక్టర్. స్టార్ కృష్ణ.




**తిరుపతి** బుధవారం మంగళం లో తిరుపతి ఆర్డీఓ రామ మోహన్, మంగళం డిపో మేనేజర్ సుధాకర్ చేతులమీదుగా ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దివ్యాంగ శక్తి స్కీమ్ ను ప్రారంభించినారు.
ఈ సందర్భంగా ఆర్డీవో రామ మోహన్ మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం విజయవంతం అయిన తర్వాత దివ్యాంగులకు కూడా ఉచిత ప్రయాణం అందించాలనే సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన నుండి పుట్టిన మరో ఉపయోగకరమైన పథకం దివ్యాంగ శక్తి పథకం అని తెలిపారు. మంగళం డిపో మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ దివ్యాంగ శక్తి స్కీమ్ ను నలభై శాతం అంగవైకల్యం ఉన్న వారందరూ పల్లెవెలుగు, సిటీ,ఆర్డినరీ, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ తదితర సర్వీసులలో దివ్యాంగులు ప్రయాణించవచ్చని, నూరు శాతం వైకల్యం ఉన్నవారికి మరియు అరవై తొమ్మిది శాతం కంటే తక్కువ ఐక్యూ ఉన్న దివ్యాంగులకు సహాయంగా వచ్చేవారికి యాభై శాతం రాయితీతో ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు డి.ఎం.గారు తెలియజేశారు. దివ్యాంగులందరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పద్మావతి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ స్టార్ కృష్ణ, కండక్టర్ రేఖ, డ్రైవర్ జి.ఆర్.చంద్ర, అన్ని అసోసియేషన్ల నాయకులు, కూటమి ప్రభుత్వ నాయకులు మరియు దివ్యాంగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ‘ధురంధర్ 2’ తెలుగు ప్రీమియర్లు క్యాన్సిల్?..



బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో రాబోతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ ‘ధురంధర్: ది రివెంజ్’ తెలుగు ప్రీమియర్ల కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు నిరాశ ఎదురైంది. కంటెంట్ డెలివరీలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా నేడు (మార్చి 18) ప్లాన్ చేసిన అన్ని తెలుగు వెర్షన్ పెయిడ్ ప్రీమియర్ షోలను అధికారికంగా రద్దు చేశారు. ఇప్పటికే బుక్‌మైషో, పేటీఎం వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ఈ షోల బుకింగ్స్‌ను తొలగించడమే కాకుండా, టికెట్లు కొనుగోలు చేసిన ప్రేక్షకులకు పూర్తి మొత్తాన్ని వెనక్కి ఇచ్చే రీఫండ్ ప్రక్రియను కూడా నిర్వాహకులు ప్రారంభించారు. ఈ సాంకేతిక ఇబ్బందుల ప్రభావం కేవలం తెలుగు మరియు ఇతర ప్రాంతీయ భాషా ప్రీమియర్లపైనే పడగా, హిందీ వెర్షన్ కంటెంట్ అందుబాటులో ఉండటంతో నగరంలోని కొన్ని ప్రధాన మల్టీప్లెక్స్‌లలో హిందీ షోలు యథావిధిగా కొనసాగే అవకాశం ఉంది. సుమారు 3 గంటల 49 నిమిషాల సుదీర్ఘ నిడివితో, ‘ఎ’ సర్టిఫికేట్ పొందిన ఈ భారీ చిత్రం రేపు ఉదయం నుంచి ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల్లో ప్లాన్ చేసిన విధంగానే గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీమియర్ షోల రద్దుతో నిరాశ చెందిన ప్రేక్షకులు తమ రీఫండ్ స్టేటస్ గురించి సంబంధిత యాప్స్ లేదా థియేటర్ యాజమాన్యాన్ని సంప్రదించాలని చిత్రబృందం సూచించింది

# ‘పెద్ది’కోసం ప్రత్యేకగీతం



రామ్‌చరణ్ తాజా చిత్రం ‘పెద్ది’ ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాపై ఇప్పటికే భారీ హైప్ నెలకొని ఉంది. పాటలు, ప్రచార చిత్రాలు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో బ్యాలెన్స్‌గా ఉన్న షూటింగ్‌ను పూర్తి చేసే పనిలో చిత్రబృందం బిజీగా ఉంది. తాజా సమాచారం ప్రకారం పదిరోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ఓ ప్రత్యేక గీతంతో పాటు కొన్ని సన్నివేశాలను పూర్తి చేస్తారట. ఈ స్పెషల్ సాంగ్‌లో ఓ అగ్ర కథానాయిక నర్తించనుందని ఫిల్మ్‌నగర్ టాక్. ద్వితీయార్థంలో వచ్చే ఈ పాట కోసం సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ హుషారైన ట్యూన్‌ను సిద్ధం చేశారని, మాస్‌ను ఉర్రూతలూగించే పాట అవుతుందని చెబుతున్నారు. జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ, బొమన్ ఇరానీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్. రత్నవేలు, సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, రచన–దర్శకత్వం: బుచ్చిబాబు సానా.



# హీరోయిన్లకు ప్రాధాన్యం ఉన్న సినిమాలకు హీరోలు భయపడుతున్నారు: తాప్సీ పన్ను

బాలీవుడ్‌లో తనదైన మాటలతో పాటు బలమైన పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న నటి తాప్సీ పన్ను తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సినీ పరిశ్రమలో ఉన్న పురుషాధిక్యతపై ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు మళ్లీ చర్చకు దారితీస్తున్నాయి.తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన తాప్సీ, కథానాయికలకు ఎక్కువ ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో నటించేందుకు చాలా మంది హీరోలు వెనకడుగు వేస్తున్నారని వెల్లడించారు. ముఖ్యంగా తాను ఒక సినిమాలో డబుల్ రోల్ చేస్తున్న సమయంలో జరిగిన ఒక అనుభవాన్ని ఆమె పంచుకున్నారు. ఆ సినిమా కోసం మేకర్స్ ముందుగా ఒక ప్రముఖ స్టార్ హీరోను సంప్రదించారని తాప్సీ చెప్పారు. అయితే కథలో హీరోయిన్ పాత్రకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని తెలుసుకున్న ఆ హీరో, అభద్రతా భావంతో ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించాడని ఆమె తెలిపారు. ఆ హీరోతో తాను గతంలో కలిసి పనిచేసినప్పటికీ, కేవలం పాత్ర నిడివితో పాటు ప్రాధాన్యం కారణంగా ఆయన వెనక్కి తగ్గడం తనకు ఆశ్చర్యం కలిగించిందని తాప్సీ పేర్కొన్నారు. అంతేకాకుండా, ఇండస్ట్రీలోకి కొత్తగా వచ్చిన యువ హీరోలు కూడా హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాల్లో నటించేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రేక్షకుల ప్రశంసలు హీరోయిన్ పాత్రకే ఎక్కువగా దక్కుతాయనే భావన వారిలో ఉండటంతో ఇలాంటి సినిమాలను చాలా మంది హీరోలు దూరంగా ఉంచుతున్నారని ఆమె అన్నారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, బలమైన కథలతో కూడిన సినిమాల్లో నటిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన తాప్సీ పన్ను చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీస్తున్నాయి. చిత్ర పరిశ్రమలో సమానత్వం, మహిళా పాత్రలకు ప్రాధాన్యం వంటి అంశాలపై ఆమె మాట్లాడటంపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ మరోసారి నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.



# నా అనుమతి లేకుండానే ఆ పని చేశారు..

## వివాదాస్పద పాటపై నోరా ఫతేహి క్లారిటీ

బాలీవుడ్ నటి, డ్యాన్సర్ నోరా ఫతేహి... ‘కేడీ: ది డెవిల్’ సినిమాలోని ‘సర్కే చునార్ తేరీ సర్కే’ పాటపై చెలరేగిన వివాదంపై ఎట్టకేలకు స్పందించారు. ఈ పాట హిందీ వెర్షన్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని, దాని నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ఓ వీడియో సందేశం ద్వారా స్పష్టం చేశారు. ఈ పాటను తన అనుమతి లేకుండానే హిందీలో డబ్ చేసి విడుదల చేశారని ఆమె ఆరోపించారు. ఈ పాటను తాను మూడేళ్ల క్రితం కన్నడలో షూట్ చేశానని, దానిని తర్వాత ఎలా మారుస్తారో తనకు తెలియదని నోరా తెలిపారు. “ఇది ఒక పెద్ద సినిమా కావడం, సంజయ్ దత్ లాంటి స్టార్ ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌కు ఒప్పుకున్నాను. వాస్తవానికి ఇది ‘నాయక్ నహీ ఖల్నాయక్ హూ మెయిన్’ పాటకు రీమేక్ అనుకున్నాను” అని ఆమె వివరించారు. కన్నడలో సాహిత్యం తనకు అర్థం కాకపోవడంతో వారు చెప్పిందే నమ్మానని, అందులో అసభ్యత ఏమీ అనిపించలేదని అన్నారు. అయితే, హిందీలో డబ్ చేసి విడుదల చేయడానికి తన నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని, ఈ విషయం తన దృష్టికే రాలేదని ఆమె ఆరోపించారు. పాట లాంచ్ ఈవెంట్‌లో కూడా తనకు ఇబ్బందికరమైన అనుభవాలు ఎదురయ్యాయని నోరా వెల్లడించారు. లిరికల్ వీడియోలో బాగాలేని ఫొటోలు, తనతో పాటు సంజయ్ దత్‌కు సంబంధించిన ఏఐ ఫొటోను వాడటం చూసి చాలా చిరాకు పడ్డానని, అయినా నిగ్రహం పాటించానని చెప్పారు. హిందీ వెర్షన్ చూసిన తర్వాత ఇది కచ్చితంగా విమర్శల పాలవుతుందని ముందే ఊహించి, ఈ విషయం దర్శకుడికి చెప్పి ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నానని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన విమర్శల కారణంగానే మేకర్స్ పాటను తొలగించారని, అందుకు తాను కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. “ఇలాంటి కంటెంట్ సృష్టించే దర్శక, నిర్మాతలు బాధ్యత వహించాలి. ఇకపై నేను మరింత జాగ్రత్తగా ఉంటాను” అని నోరా పేర్కొన్నారు.

# రాజకీయాల్లో నటీమణులను లాగొద్దు..

## – మంచు విష్ణు ఘాటు స్పందన



తమిళనాడు రాజకీయాల్లో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా స్టార్ హీరో విజయ్ సొంత రాజకీయ పార్టీ ప్రారంభించిన తర్వాత ఆయన వ్యక్తిగత జీవితంపై వస్తున్న విమర్శలు కలకలం రేపుతున్నాయి. విజయ్ భార్యతో విడాకుల వ్యవహారం, అలాగే ప్రముఖ నటి త్రిషతో ఆయనకు సంబంధం ఉందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశం మరింత చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రచారాలపై ఇప్పటికే సీనియర్ నటి ఖుష్బూ సుందర్ స్పందించారు. త్రిష ఎంతో గౌరవనీయమైన నటి అని, ఆమెపై ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం సరికాదని పేర్కొంటూ ఆమెకు మద్దతుగా నిలిచారు. ఈ వివాదాల నేపథ్యంలో నటుడు మంచు విష్ణు కూడా సోషల్ మీడియా ద్వారా స్పందించారు. రాజకీయ కథనాల్లోకి నటీమణులను లాగడం అత్యంత అసభ్యకరమైన చర్య అని ఆయన తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం తమిళనాడులోనే కాకుండా ఎక్కడైనా రాజకీయ లబ్ధి కోసం సినీ తారల వ్యక్తిగత జీవితాలను ఉపయోగించడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. నటీనటులు కేవలం తెరపై కనిపించే పాత్రలే కాకుండా వారికి కూడా భావోద్వేగాలు, గౌరవం ఉంటాయని మంచు విష్ణు పేర్కొన్నారు. వారి జీవితాల్లో కూడా ఒక ప్రైవేట్ స్పేస్ ఉంటుందని, దానిని గౌరవించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని చెప్పారు. అలాగే నటీనటులకు కుటుంబాలు ఉంటాయని, సమాజంలో వారికి ఒక హోదా ఉంటుందని ఆయన గుర్తు చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం వారి ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించడం నాగరిక సమాజానికి తగినది కాదని వ్యాఖ్యానించారు. ప్రజా చర్చలు లేదా రాజకీయ విమర్శలు అనేవి ప్రాథమిక గౌరవాన్ని దెబ్బతీసేలా ఉండకూడదని విష్ణు సూచించారు. ముఖ్యంగా మహిళల విషయంలో మరింత సంయమనం పాటించాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినా అవి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఉండకూడదని, వార్తల కోసం వారిని బలిపశువులుగా మార్చడం తగదని హితవు పలికారు. భారతీయ సంస్కృతిలో మహిళలకు ఎప్పుడూ గౌరవప్రదమైన స్థానం ఉంటుందని గుర్తు చేసిన మంచు విష్ణు, అలాంటి దేశంలో రాజకీయాల కోసం మహిళలను అవమానాలకు గురిచేయడం దురదృష్టకరమని అన్నారు. “మనం మరింత మెరుగ్గా ప్రవర్తిద్దాం” అంటూ సమాజానికి, రాజకీయ వర్గాలకు ఆయన పిలుపునిచ్చారు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154